కేతవరపు రాజ్యశ్రీ

కవిత్వం

# ఆకసాన్ని మింగాలని





"భారత్ భాషా భూషణ్" బిరుదు వచ్చిన
సందర్భంగా పండితులచే ఆశీర్వాదం.



"భారత్ భాషా భూషణ్" బిరుదు వచ్చిన
సందర్భంగా అభినందన సత్కారం



బంధువులచే సత్కారం



బంధువులచే సత్కారం



తంగిరాల మెమోరియల్‌వారి సన్మానం



తెలుగు సాహిత్య కళాపీఠం వారి సత్కారం



శ్రీకిరణ్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు
శ్రీలంకా సుబ్రహ్మణ్యంగారితో సత్కారం



"చైతన్య భారతి" వారి సత్కారం

# ఆకసాన్ని మింగాలని

## కేతవరపు రాజ్యశ్రీ

ప్రచురణ - 2014

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

ప్రథమ ముద్రణ : మే, 2014

కాపీలు : 500

హక్కులు రచయిత్రివి

వెల : రూ.80/-

ప్రతులకు:

**శ్రీమతి రాజ్యశ్రీ**

ప్లాట్ నెం.301, గోకుల్ అపార్ట్‌మెంట్స్

స్ట్రీట్ నెం.4, అశోక్ నగర్, హైదరాబాదు - 500 020.

ఫోన్ : 2767 0267, సెల్ : 85001 21990

డి.టి.పి. :

కె. బాలకృష్ణ, హైదరాబాదు.

సెల్ : 95506 81039

ముద్రణ :

**Marvellous Printers,**

Nallakunta, Hyderabad.

Ph: 9246558809, 9247113504

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | కోర్కెల చిట్టా | 21 |
| 2. | అమ్మ | 22 |
| 3. | వయసా పరుగుతీయకు | 23 |
| 4. | వారు అస్థిత్వం కోల్పోయారు | 25 |
| 5. | అందరివాడు | 26 |
| 6. | ఎక్కడోవున్నావనుకున్నా! | 29 |
| 7. | కొందరివాడు | 31 |
| 8. | దేవుడు ఎదురుచూస్తున్నాడు | 32 |
| 9. | సంస్కృతీ సాంప్రదాయాల గడప | 33 |
| 10. | బలహీన జనులము | 36 |
| 11. | పంచుకోవడంలోని సౌఖ్యం | 37 |
| 12. | మా అపార్టుమెంట్ | 38 |
| 13. | తెలుగు భాషను నేను | 40 |
| 14. | మన టంగుటూరి | 42 |
| 15. | ఉగాది పురస్కారం | 44 |
| 16. | ఆనంద మన సొంతం | 48 |
| 17. | చూపుడు వేలు | 49 |
| 18. | నిద్ర | 50 |
| 19. | నవయుగ వైతాళికుడు - గురజాడ | 51 |
| 20. | నిత్యయవ్వనుడు | 53 |
| 21. | అలసిన పుడమి తల్లి | 54 |
| 22. | కన్నీటికి మానవ రూపం | 55 |
| 23. | రేపటి సుఖం | 56 |
| 24. | తృప్తి | 58 |
| 25. | చీకటిని ఊడ్చిన సూరీడు | 60 |
| 26. | ఎంత చక్కని దోయి | 61 |

| | | |
|---|---|---|
| 27. | అనురాగ భరితం | 62 |
| 28. | సాహిత్యమంటే | 64 |
| 29. | పాఠకపాత్ర | 65 |
| 30. | కలలు | 66 |
| 31. | రాత్రి 12 గంటలు | 67 |
| 32. | స్వాగతం ఉగాదీ స్వాగతం | 68 |
| 33. | ప్రజాస్వామ్యాన్ని నడిపించేది | 70 |
| 34. | అందమైన పిల్లి | 72 |
| 35. | చెట్టు నేర్పిన అక్షరాలు | 73 |
| 36. | మా ఇంట్లో | 74 |
| 37. | ఈ రోజు | 74 |
| 38. | మిస్ ఇండియా | 75 |
| 39. | సూటిగా | 76 |
| 40. | కళ్లలో ఒత్తులేసుకుని | 77 |
| 41. | ఆకసాన్ని మింగాలని | 78 |
| 42. | అమెరికా ఎత్తుకెళ్లిన దీపావళి | 79 |
| 43. | అందాల ప్రకృతి | 81 |
| 44. | మనసు వెంట | 82 |
| 45. | ఆమె పలవరింపు | 83 |
| 46. | బాల్యమా! నీకు జోహార్లు | 84 |
| 47. | ప్రథమ బహుమతి | 85 |
| 48. | నిస్తేజం | 86 |
| 49. | నాన్న | 87 |
| 50. | అర్థం మార్చాల్సివస్తుందేమో! | 88 |
| 51. | వెంకటాద్రి రైలుబండి | 90 |
| 52. | మా అల్లుడు బంగారం | 92 |
| 53. | అక్కున చేర్చుకుందాం | 94 |
| 54. | మహాభి నిష్క్రమణం | 97 |

# అంకితం



విద్యార్థిగా, ఆచార్యుడిగా, బోధకుడిగా
ఆయన ప్రతిభా పాటవాలు కడు ప్రశంశనీయం
తన విజయాన్ని గురువులకు అంకితమిచ్చిన వినయశీలి
వృత్తి రీత్యా వైద్యులు
ప్రవృత్తి రీత్యా సాహిత్యాభిమానులు
అన్ని రకాల సాహితీ ప్రక్రియలను
ఆశ్వాదించి, అభినందించే సాహితీ బంధు
ప్రసిద్ధ కవుల కావ్యాలను సైతం
అధ్యయనం చేసిన ఆసక్తిపరులు
నిరాడంబరులు, నిగర్వి, సుగుణశీలురు
డా॥ ధర్మపురి మధుసూధన్, యం.యస్., డి.ఎల్.ఓ. గారు
వారిని వెన్నంటి, వారి విజయాలను తన విజయాలుగా భావించి
సహాయ సహకారాలను అందించే ఇల్లాలు శ్రీమతి రోహిణిగారు.
డా॥ ధర్మపురి మధుసూధన్, శ్రీమతి రోహిణిగార్లకు
ఈ "ఆకసాన్ని మింగాలని" కవితా సంకలాన్ని
హృదయ పూర్వకంగా అంకితమిస్తున్నాను.

కేతవరపు రాజ్యశ్రీ

# కేతవరపు రాజ్యశ్రీ పరిచయం

| | | |
|---|---|---|
| పేరు | : | డా॥ కేతవరపు రాజ్యశ్రీ |
| శ్రీవారు | : | కె. మాధవరావు |
| తల్లిదండ్రులు | : | శ్రీమతి ప్రభావతి, కీ.శే. మహాకాళి వెంకటరావు |
| విద్యాభ్యాసం | : | ఎం.కామ్. (ఉస్మానీయా విశ్వవిద్యాలయం) |
| వృత్తి | : | ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ప్రభుత్వ ఉపకార్యదర్శిగా 2011లో పదవీ విరమణ |
| ప్రవృత్తి | : | రచనా వ్యాసంగం, వీణా వాదన, ఆధ్యాత్మిక ప్రవచనాలు, చెస్ ఆడటం, కవితా గోష్ఠి |
| ముద్రిత రచనలు | : | 12 |
| సంకలన ప్రచురణలు | : | 5 |
| అధ్యక్షులు | : | లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం |
| సలహాదారు | : | ఆదర్శవాణి మాసపత్రిక |
| జీవిత కాల సభ్యులు | : | 1. శ్రీ త్యాగరాయ గాన సభ<br>2. అశోక్ నగర్ వెల్‌ఫేర్ అండ్ కల్చరల్ సొసైటీ<br>3. అఖిల భారతీయ భాషా సమ్మేళన్, భోపాల్ |
| పురస్కారాలు | : | 'భారత్ భాషా భూషణ్', 'ప్రజ్ఞాశ్రీ', 'కళాపురస్కారం', 'టంగుటూరి ప్రకాశం పంతులు' అవార్డు, తంగిరాల మెమోరియల్ ట్రస్టువారి పురస్కారం, 'మదర్ థెరిస్సా అవార్డు', 'స్త్రీ శక్తి' ప్రతిభా పురస్కారం, ప్రపంచ తెలుగు మహాసభల్లో సత్కారం, 'తానా మహాసభలో సత్కారం', ఆంధ్ర సారస్వతసమితి మచిలీపట్నం వారిచే పురస్కారం, |
| ఇతరములు | : | పర్యావరణ పరిరక్షణ మీద అమలా అక్కినేనిగారిచే సచివాలయలో లఘుచిత్ర ప్రదర్శన ఏర్పాటుచేయడం, ప్లాస్టిక్ నిషేధం గురించి గవర్నమెంట్ ఆర్డర్స్ ఇప్పించడం. డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారిచే సచివాలయంలో నూలు సంచుల పంపిణీ, దూరదర్శన్‌లో పూలతోట కార్యక్రమంలో కవితలు ప్రసారం. భక్తి టీవిలో ఉగాది కవితా పఠనం. ఆలయవాణి వెబ్ రేడియోలో ఆధ్యాత్మిక భక్తి కవి సమ్మేళన నిర్వాహణ. |



భారత్ భూషా భూషణ్
కవితిలక **డా॥ తిరునగరి**
617/5, డి. నగర్, చింతల్ (హెచ్.ఎం.టి)
హైదరాబాదు 500 054.

# కవితారాజ్యశ్రీ

'లలితపద హృద్యపద్యం
బులన, కధార్థంబు ఘటితపూర్వాపరమై
యలతి యలతి తనియగా
హల సంధించిన విధంబు నమరగవలయున్'

-తిక్కన-నిర్వచనోత్తర రామాయణము (1-16)

'అవతరింపవలయు అవనిపై దేవుడు
రక్త మాంస దేహయుక్తుడగుచు
వడలు, పలుకుబడులు నుడికారముతోడి
కారయిత్రిలేక కవితలేదు.

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు, మానస సరసి.

అలతి అలతి తునియల కాహల సంధించిన విధంగా లలిత పద హృద్య పద్యాలలో కవిత్వం ఉండాలన్నారు, ప్రాచీన మహాకవి తిక్కన.

వడలు, పలుకుబడులు, నుడికారాలతో కవిలో, "కారయిత్రి" ఉంటేనే అది కవితగా నిలుస్తుంది అన్నారు, ఆధునిక మహాకవి డా॥ నండూరి రామకృష్ణమాచార్య.

తిక్కన అన్నట్లుగా అలతి అలతి పదాలలో అందమైన భావాలను పొదగడం కొందరికే సాధ్యం.

వడలు, పలుకుబడులు, నుడికారాలతోకారయిత్రి ప్రతిభ కొందరికే ఉంటుంది. అది పద్యమైనా గద్యమైనా హృద్యంగా రాసే శిల్పాన్ని సొంతం చేసుకున్న కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ. ఆధునిక సాహిత్యరంగంలో మంచి

కవయిత్రిగా తన స్థానాన్ని పదిలపరచుకున్న రాజ్యశ్రీ లేఖిని నుండి వెలువడిన సరికొత్త కవితా సంపుటి, "ఆకసాన్ని మింగాలని". పేరులోనే నవ్యత, కవిత్వం నవనవంగా ఉండాలన్న లక్ష్యం ఆమెది. కేచిత్ కవినాం నవాదృష్ణం, అని కదా ఆలంకారికల ఉవాచ.

'మా వీధి మొదలు నుంచి
వీధి చివర హనుమంతుడి కొవెల వరకు
ఎనెన్నో పాద ముద్రలు
కోరికలే గుర్రాలయి
దేవుడి అనుగ్రహంకోసం
పాదాలు పరుగులు పెట్టిస్తుంటాయి.

అధికారం కోసం దర్పప్రదర్శన కోసం, ధనదాహంతో, ఇలా ఎన్నో వాంఛలతో, ఆశలతో వచ్చే పాదాలను చూచి దేవుడు.

"ఏ పాదలు
దయా సౌరభాన్ని నింపుకొని
నిష్కామహృదయంతో
ఆత్మార్పణకావించడానికి వస్తాయోనని,
ఎదురుచూస్తూన్నాడు" అన్నారు కవయిత్రి ఎంత అందమైన ముగింపు.

"టి.వి., కంప్యూటర్, సెల్ ఫోన్లే
ఊపిరిగా బ్రతుకుతున్న
మరమనుషులు
భాధపంచుకోవడం ఎరగని
స్పందించడం తెలియని జీవులు"

అంటూ నేటి సమాజంలోని మనుషుల మనుగడని స్వార్థ దృష్టినీ ఎత్తిచూపుతూ ఈ కవయిత్రి

"పంచుకోవడంలోని సౌఖ్యం
పంచుకోవడంలోని ఆనందం
పంచుకోవడంలోని ఆరోగ్యం
మరమనుషులకెలా తెలుస్తుంది". అని ఖేదపడ్డారు.

'ఈ పంక్తులు చదవగానే నాకు

'ఉన్నదాన్ని ఉన్న వాళ్ళందరికీ పంచి
ఉన్నంతలో అందరంకలిసి భోంచేసి
ఉజ్జ్వలంగా ఆటల్లో పాటల్లోపడి
ఊరంతా తిరగడం ఎంతబాగుటుంది'. అన్న

మహాకవి దాశరథిగారి కవిత గుర్తుకు వచ్చింది. క్రాంతదర్శులైన కవుల ఆశయాలు, ఆకాంక్షలు ఒకే రీతిగా, ఉన్నతంగా, విశాలంగా ఉంటై. స్త్రీ త్యాగాన్ని ఆర్ద్రంగా వర్ణించిన కవిత 'నిద్ర'. శైశవం నుండి వృద్ధాప్యందాకా గల అన్ని దశల్లోనూ నిద్రకు నోచుకుని మహిళ చివరిలో

'ఎన్నాళ్ళనుంచో తీరని కోరిక
హాయిగా ఆదమరచి నిద్రపోవాలని
ఆకోరిక తీరేది బహుశః
మృత్యుదేవత ఒడిలోనే నేమో
శిలలైనా ద్రవించి ఏడుస్తే
అలసిన పుడమితల్లి మరో కరుణరసాత్మక కవిత

"ఇప్పుడు పచ్చదనం కోల్పోయి
యౌవన హొయలు కనుమరగయి
వృద్ధాప్యపు పొడలతో అలసినట్టనిపిస్తోంది.

ఎండిన స్తనాలను సైతం
కసాయి బిడ్డల నోటికందించాలని
తపనపడుతున్న పిచ్చితల్లి

త్యాగమేకానీ స్వార్థ మెరుగని
పుడమితల్లి" అన్నారు.

వ్యంగ్యం కవితకు ప్రాణం అని తెలిసిన కవయిత్రి రాజ్యశ్రీ
మా ఇంట్లో
ఎప్పుడూ నిశ్శబ్దం
రాజ్యమేలుతుంటుంది
అందుకే
గిన్నెలు
మాట్లాడుకుంటాయి
వాటి బుగ్గలు
సొట్టలు పడుతుంటాయి, అన్న చిన్న
కవిత అందుకు ఉదాహరణ

'మిస్ ఇండియా, ఈ కోవకు చెందిన కవిత
ఆ ఇంటిలోని పనిపిల్ల
ఒంటినిండా బట్ట కప్పలేని
పేదరికం దానిది
తరగనంత ఆస్తి ఉన్నా
వంటినిండా
బట్టలేసుకోవడం మోటు
నేటి ఫ్యాషన్ ప్రపంచములో
పేదరికంలో ఒకరు
నాగరికత పేరుతో మరొకరు
యౌవనాన్ని బట్టబయలు
చేసుకుంటున్నారు". వంటి పంక్తులు పఠితను ఆలోచింపజేసేవి.

"దృశ్యాలను వెనక్కి నెడుతూ
వాగులు దాటుతూ
వంకలు పోతూ
వంతెన లెక్కి దిగుతూ
సొరంగాలగుండా వెళ్ళే" వెంకటాద్రి రైలు బండి"

కవితను చదువుతుంటే ప్రసిద్ధాంగ్లకవి హుమాయూన్ కబీర్, "ది ట్రైన్" మనసులో మెదలుతుంది. సమాజాన్ని చూచి స్పందించి రాజ్యశ్రీ రచించిన కవితల సమాహారం 'ఆకసాన్ని మింగాలని'

మనిషికెంత ఆత్రమో
ఆకసాన్ని మింగాలని, అన్న పంక్తులు భావగర్భితాలు

"సాహిత్యమంటే
అక్షర సముదాయంకాదు
మనిషి మస్తిష్కంలో
చొచ్చుకుపోయి
మానవతారాగాలు
పలికించేది"

అని తెలిసిన పరిణత కవయిత్రి, కవితా రాజ్యశ్రీ కేతవరపు రాజ్యశ్రీ ఓ మంచి కవితా సంపుటి 'ఆకసాన్ని మింగాలని'.

మంచు కొండ శీవి, మరుమల్లియతావి తగ్గనంతకాలం, ఈ కవితా రాజ్యశ్రీ ప్రతి కవిత ప్రజల హృదయాలలో గుబాళిస్తూనే ఉంటుంది.

13-12-2013



సుధామ
కవి, విమర్శకులు
(ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి)

# ఆంక్షలులేని ఆకాంక్షలు

అప్పుడెప్పుడో బాల హనుమంతుడు సూర్యబింబాన్ని చూసి 'ఎర్రటి పండు' అనుకుని మింగబోయాడట. కేతవరపు రాజ్యశ్రీ 'ఆకసాన్ని మింగాలని' వెలువరిస్తున్న ఈ కవిత్వాభిలాష అలానే ముచ్చటేస్తూంది. స్త్రీ 'ఆకాశంలో సగం' అన్నారు. కానీ రాజ్యశ్రీ 'ఆసాంతం' కావాలని అభిలషిస్తున్నది. అకారాది క్రమంలో అచ్చులతో 'అమ్మ' గురించి చెప్పడమనే పిల్లలకు నచ్చే ప్రాథమికత నుంచి, 'ఎక్కడో వున్నావనుకున్నా' అంటూ 'మంచి చెడుల హెచ్చరిక చేస్తూ - అంతరంగాలోనే వున్న' దైవభావన అన్వేషణా స్థాయివరకూ సుమారు యాభై ఖండికల ఈ సంపుటిలో నిరలంకార శోభితంగా కవితాత్మను వాచ్యం చేసిన సూటిదనం, తేటదనం గోచరమవుతాయి.

"సాహిత్యమంటే
అక్షర సముదాయంకాదు
.......
మాటలోని శబ్దాన్ని
మౌనంలోని భావాన్ని
పాటలోని హాయినీ
పరువంలోని వయ్యారాన్నీ
కమనీయంగా దర్శింపచేస్తుంది"

అంటారు 'సాహిత్యమంటే' అనేఖండికలో ఎంత నిజం!

'చీకటిని ఊడ్చినసూరీడు' అన్న కవిత మునుపే రాసిందయినా, ఆ శీర్షిక ఇప్పటి ఢిల్లీలో 'చీపురు' గుర్తుతో ఎన్నిక రణరంగంలో కేతనం ఎగరేసిన 'ఆమ్ ఆద్మీ' కి సూచికగా ధ్వనిస్తుంది కేతవరపు భావనలో. "చీకటిని ఊడ్చి లేకిరణాలతో ముగ్గులువేసిన" సామాన్యుడే-నేటి ఎర్రసూరీడు అనలేమా!

తమకేది కావాలో
స్పష్టమైన అవగాహనతో
నచ్చినరీతిలో
జీవితం గడుపుతున్న నేటి తరాన్ని చూస్తే

పదవీవిరమణ చేసిన ఈమె "ఇప్పటికయినా మించిపోయిందిలేదు - నీ కిష్టమైన రీతిలో - అర్థవంతంగా జీవించడం మొదలుపెట్టు" అన్న అంతరాత్మ రొదతో జీవితాన్ని ఆస్వాదించడం మొదలుపెట్టేందుకు వయసును పరుగులు తీయవద్దని అభ్యర్థిస్తోంది. కానీ కాలం ఆగదు కదా!

తమకేదో తక్కువైందని
ఏదోలేదని బాధపడేవారు
ఏమిలేని నిర్భాగ్య జీవితాలనుంచి
స్ఫూర్తి తెచ్చుకోవాలి
ఉన్నదానితో తృప్తిపడటం నేర్చుకోవాలి
నలుగురితో పంచుకోవడం
అలవరుచుకోవాలి

అంటూ అప్పుడే 'ఆనందం మన సొంతం' అని అభివ్యక్తీకరించడం ఎంతైనా సంతోషదాయకం. గురుజాడ గురించీ, తెలుగు భాష గురించీ, ఉగాది గురించీ, మిత్రురాలు రమ గురించీ, దామోదరం సంజీవయ్య గురించీ, టంగుటూరి ప్రకాశం గురించీ, దీపావళి గురించీ, అల్లుడు శ్రీకాంత్ గురించీ - ఇలా వైవిధ్య భరితమైన భావాలకు ఈ వచన కవితల్లో ప్రోదు కల్పించారు కే.రా.

నేటి నిజం, సాహితీ కిరణం, సాహిత్య ప్రవంతి, మూసీ, విశ్వరచన, సాహిత్య ప్రస్థానం, ఆదర్శవాణి వంటి పత్రికలలో ఇందులోని పలు రచనలు మునుపు అచ్చు పురుడు పోసుకున్నవే. 'పంచుకోవడంలోని సౌఖ్యం', ఎంతో, 'ప్రజాస్వామ్యాన్ని నడిపించేది' ఏమిటో, ఆమెకు తెలుసు. మానవీయత కోసం, 'ఆమె పలవరింపు' అని అర్థం అవుతూనే వుంటుంది. ఈ అక్షరాలబార్ల వెంట కనులు పరుగులు తీసినప్పుడు - ఎలాంటి అనవసరపు 'సాము'లు చేయకుండా 'నేల' పై నిలచి భావాభివ్యక్తం చేయడమే కవిత్వం అని ఈ సంపుటి చూశాక, 'అర్థం మార్చాల్సి వస్తుందేమో!' ఏమయినా కవితా రాజ్యశ్రీ ఆకాశం మరింత ఎత్తుగా, మహోన్నతంగా విస్తరించాలని నా ప్రగాఢ శుభాకాంక్షలు. ఈ సంపుటిలోనివన్నీ ఆ సహృదయశీలి ఆంక్షలు లేని ఆకాంక్షలు. సాదరంగా స్వాగతించడం ఇక మీ పాలు.

సదా మీ

**18.12.2013** **సుధామ**




**రంగనాథ్**
ప్రముఖ సినీ నటులు,
రచయిత


# శుభాభినందనలు

ఒక్క దండం పెట్టి కోటి కోర్కెలు కోరే మానవుడెంత మాయగాడు!

కేతవరపు రాజ్యశ్రీ "అమ్మగారు" అదృష్టవంతులు. అమ్మగురించి ప్రస్థావించకుండా ఆమె రచన వుండదేమో! అమ్మనేకాదు నాన్ననీ గుండెలో నింపుకొన్నది - ఒక హితుడిగ, ఒక మంచి స్నేహితుడిగ, వేలుపట్టి నడిపించే వేలుపుగ. అల్లుడు, దశమ గ్రహం అనుకోవడం పరిపాటి. కానీ రాజ్యశ్రీగారు "నా అల్లుడు బంగారం" అనడం అందంగా వుంది. అల్లుడిగారికిది ఆనందదాయకం.

సృష్టికి అద్యంతాలు దైవమైతే, ప్రేమకు అద్యంతాలు 'అమ్మ' అని అక్షరాల ఆవిష్కరణ ప్రశంసనీయం.

ఈ జీవితాన్ని ఆస్వాదించాలని వుందని - అసలు ఆకార్యం మొదలుకాని నిన్నటి స్త్రీ పరాధీనత నెంత చక్కగా చెప్పగలిగింది. అలాగే ఆదమరచిన నిద్రకు నోచని స్త్రీ దురదృష్టాన్ని కూడ.

అందరికి కనిపించే బాంబుల కడపని ఎన్నెన్నో విశేషాల జీవగడ్డగా వివరించింది!

మేఘం వర్షిస్తే తడవని దుండదు.

రాజ్యశ్రీగారి హృదయం స్పందిస్తే వారి కలం స్పృశించని అంశంగానీ ప్రక్రియగానీ వుండదు. వారి సాహితీ ప్రస్థానం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ...



**రంగనాథ్**



**డా॥ డి. మధుసూధన్**
M.B.B.S., (OSM), M.S. (ENT), D.L.O.,
D.A.C.T., F.R.S.H. (London), M.A.O.I.,
Ear, Nose & Throat Specialist
Kalyan Nagar, Phase - III, Hyderabad.

# శుభాకాంక్షలు

నేను "శుభాకాంక్షలు" వ్రాస్తున్నప్పుడు ఒక మంచి వార్త తెలిసి ఎంతో సంతోషించడం జరిగింది. ఆ వార్త శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీగారికి అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (భోపాల్) వారి "భారత్ భాషా భూషణ్" డిగ్రీ ప్రదానం జరగబోతోందని. 01.12.2013 నుండి డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీగా మారిన వారు సాహిత్యంలో అన్ని ప్రక్రియలలోనూ చాలా ఉన్నత స్థితికి చేరుకోవడం జరిగింది. ఇది నేను దాదాపుగా ఐదు సంవత్సరాలుగా గమనిస్తున్నాను. వారి పుస్తకావిష్కరణ మహాసభల్లో స్వయంగా పాల్గొనే భాగ్యం నాకు లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

"గుండె చప్పుళ్లు" వింటూ "తృప్తీ నీవెక్కడ?" అని అన్వేషిస్తూ "వెన్నెల మెట్లు" ఎక్కుతూ రోజు రోజుకూ హిమాలయ శిఖరాలందుకోవడంలో కృతకృత్యులవుతున్నారు.

"ఆకసాన్ని మింగాలని" వారికున్న తపనతో "కోర్కెల చిట్టా" ముడి విప్పారు. ప్రతి కవితలోను వారి సున్నిత భావాలు మనముందుంటున్నాయి. మనిషి మాత్రం ఏవిధంగా అహంకార మమకారాల చుట్టూ పరిభ్రమిస్తున్నాడో వారు చెబితేనే మనకు పూర్తిగా అర్థం అవుతుంది. వారి కవితలు "కట్టె-కొట్టె-తెచ్చె" మాదిరిగా ఉండవు. అందులో ఎంతో సుదీర్ఘమైన ప్రయాణం చేయిస్తారు. "వయసా పరుగు తీయకు" అంటూ.

వ్యక్తిత్వమంటే ఏమిటో తెలియకుండానే కాలప్రవాహంలో కొట్టుకు పోతున్న నేటి తరాన్ని అబ్బురంగా చూస్తుంటారు రచయిత్రి. మనకు తెలియని ఎన్నో విషయాలు తెలియజేస్తుంటారు, "కడప" విషయంలాగా. "మా అల్లుడు బంగారం" అంటూ అల్లుడుగారిని గుణగణాలను వర్ణించడంలో వారికి వారే సాటి.

డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీగారి "ఆకసాన్ని మింగాలని" కావ్య ఆవిష్కరణ సందర్భంగా నా శుభాకాంక్షలు తెలుపుతూ వారు మరెన్నో కావ్యాలను మనకందరికి అందించాలని ఆశిస్తూ....

సోదరుడు

(డాక్టర్ ధర్మపురి మధుసూదన్)
ఎం.బి.బి.ఎస్., ఎం.ఎస్.

# నామాట

"హృదయ స్పందనలకు
అక్షర రూపమిస్తే
కవితలుగా
రూపాంతరం"

"కవిత్వం ఓ తీరని దాహం" అన్నారు నిజంగా ఇది అక్షరసత్యం. రాయడం మొదలుపెట్టాక "కుక్కపిల్ల, సబ్బు బిళ్ళ, కాదేది కవితకనర్హం" అని శ్రీశ్రీగారు అన్నట్లు, అలా దృష్టిలోకి వచ్చి స్పందన కలిగించే వస్తువేదైనా కవితగా మారుతుంది. నాలో అలజడి చేసిన కొన్ని భావాలకు చిరురూపమే "చిరు సవ్వడులు" కవితా సంకలనంగా (నానీలు) మారి పలువురి ప్రశంశలు పొందడం జరిగింది. అప్పటినుంచి అక్షరాలు నన్ను వెంటాడుతూ దాదాపు అన్ని నూతన ప్రక్రియల్లో నా గుండెచప్పుళ్లు వినిపించాయి. నా భావాలకు రెక్కలు తొడుగుతూ రెక్కల ప్రక్రియలో "వెన్నెల మెట్లు" ఎక్కించింది. వ్యంజకాల ప్రక్రియలో "బొమ్మ బొరుసు" ఆడించాయి. "అక్షర కేతనం" ఎగురవేస్తూ ముక్తకాలు రాయించాయి. తరువాత మినీ కవితలుగా మారి "సిసింద్రీలు" పేల్చాయి. అంచెంచెలుగా "ఊహల వసంతం" వచన కవతా సంపుటి రాసి, "తృప్తీ నీవెక్కడ" అంటూ తృప్తిని వెదుకుతూ కవితా సంపుటి వెలువరించినా, మనిషికి చివరకు అనుసరించ వలసిన 'ఆధ్యాత్మికత" లోకి దారి మళ్లించి "రెక్కల్లో గీతామృతం", "నీలోకి నువ్వు", "ఆధ్యాత్మికత" వృద్ధులకేనా? అనే వ్యాససంపుటాలను రాయించాయి. అయినా అక్షరాలకు తృప్తిలేక ఇప్పుడు "ఆకసాన్ని మింగాలని" అన్న కవితా సంపుటి రాయించాయి.

ఇంతకు ముందే వివిధ రచయితలు, కవులు రాసిన కవితలు, కథలు, సంకలనం చేస్తూ ఐదు పుస్తకాలు వెలువరించాను.

ఇవన్నీ రాయడం, సంకలనం చేయడం, ఒక ఎత్తయితే, పాఠకుల ఆదరణ పొందడం మరొక ఎత్తు, వారి ఆదరణే ఉత్సాహాన్ని నింపి ఈ కవితా పుస్తకం వెలువరించడం జరిగింది.

ఈ పుస్తకాన్ని రాస్తున్నపుడే, నాకు అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్, భోపాల్ వారిచే "భారత్ భాషా భూషణ్" అవార్డు ప్రకటించారని తెలిసింది. ఆ సంతోషాన్ని మీతో పంచుకుంటున్నాను.

పుస్తకాన్ని సహృదయులు, రసజ్ఞులు, చదివి వారి స్పందన తెలియ చేస్తారని ఆశిస్తూ...

**కేతవరపు రాజ్యశ్రీ**

# కృతజ్ఞతాంజలి

'కవితా రాజ్యశ్రీ' అనే ముందుమాట ద్వారా నా భావతరంగాలను తనదైన, అరుదైన శైలిలో అభినందనలు కురిపిస్తూ. "ఆకసాన్ని మింగాలని" కవితా సంపుటికి సొగసు చేకూర్చిన మానవీయ కవివరేణ్యులు, భారత్ భాషా భూషణ్, కవితిలక బిరుదాంకితులు డా॥ తిరునగరిగారికి, మనసా వాచా కృతజ్ఞతాభివందనాలు.

ఇంతేకాకుండా వారి "పోస్టు కార్డు" లేఖల ద్వారా నా కవితాయానాన్ని ప్రస్తుతిస్తూ, ఉత్సాహపరుస్తూ పలకరిస్తున్న తిరునగరిగారు నాకు గురుతుల్యులు. వారి ఆశీర్వాదం నాకు మరింత కవిత్వాన్ని రాసే శక్తినిస్తోంది వారికి సదా కృతజ్ఞురాలిని.

"ఆంక్షలులేని ఆకాంక్షలు" అంటూ నా కవితలను విశ్లేషిస్తూ, ప్రోత్సహిస్తూ, చేరా, బూరా, నారా, సరసన 'కేరా' అంటూ నన్ను కూడా చేర్చి, సాహితీవనంలో నాకొకస్థానం కల్పించి, శుభాకాంక్షలందచేసిన ప్రసిద్ధ కవి, విమర్శకులు శ్రీ సుధామగారికి వందనాలు.

ఆశీఃపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తూ, నా అభివృద్ధిని కాంక్షిస్తున్న సాహిత్యాభిమానులు డా॥ డి. మధుసూధనరావుగారికి ప్రత్యేక ధన్యవాదాలు.

శుభాభినందనలు తెలియచేస్తూ తన అమూల్యమైన స్పందన తెలియచేసి నందుకు ప్రముఖ సినీ నటులు, రచయిత శ్రీ రంగనాథ్‌గారికి కృతజ్ఞతాభి వందనాలు.

ఈ కవితలను ప్రచురించిన నేటినిజం, సాహిత్య ప్రస్థానం, చేతన, ఆదర్శవాణి, బాలబాట, గూఢాచారి పత్రికా సంపాదకులకు, డి.టి.పి. చేసిన కె. బాలకృష్ణకు, సహాయ సహకారాలందించిన శ్రీవారికి, కవర్ పేజీ డిజైన్ చేసిన తనయ ప్రియాంక, తనయుడు ఫణీంద్రలకు కృతజ్ఞతలు.

**కేతవరపు రాజ్యశ్రీ**

# కోర్కెల చిట్టా

ఏమి పుణ్యము చేసెనో శిల
తన ఎదపై శ్రీహరి రూపమును చెక్కుకుంది
ఏమి పుణ్యము చేసెనో వులి
నిరాకారుడికి ఆకారమిచ్చి తరించింది
ఏమి పుణ్యము చేసెనో ఉసిరి
తన హృదిని తొలచి దీపమెలిగించి
శివుని అర్చించుకుంది
ఏమి పుణ్యము చేసెనో రావి
తన తరు ఛాయలో
దేవ దేవుని సేద తీర్చుతుంది
పెదవి విప్పి పలుకలేనివై కూడా
తమను తాము అంతర్యామికి
ఆత్మార్పణ కావించుకుని
తరిస్తున్నాయి
పలుక నేర్చిన మనిషి మాత్రం
అహంకార మమకారాల చుట్టూ
పరిభ్రమిస్తూ
పలుకు నేర్పిన పరాత్పరుడిని
నోరారంగ నుతింపక
ఒక్క దండం పెట్టి
కోటి కోర్కెల చిట్టా విప్పుతాడు.

*(విశ్వసాహితిలో ప్రచురితం)*

# "అ, ఆ"లలో అమ్మ

భాషకు తొలి అక్షరం 'అ' అయితే
ప్రేమకు ఆద్యంతాలు 'అమ్మ' అనే రెండక్షరాలు
అ నుండి అః వరకు అక్షరాలు
అమ్మను అర్చించుకున్నవైనమిది
'అ' వధులు లేని ప్రేమకు రూపం అమ్మ
'ఆ' కాశమంత సహనం అమ్మ
'ఇ' లలో వెలసిన దేవత అమ్మ
'ఈ' జగతిని పరిచయం చేసేది అమ్మ
'ఉ'గ్గు పాలతో దైవ భక్తిని రంగరిస్తుంది అమ్మ
'ఊ'యల ఊపుతూ వీరగాథల జోల పాటలతో
నిదురపుచ్చుతుంది అమ్మ
'ఎ'దురొడ్డి నిను వెనకేసుకొస్తుంది అమ్మ
'ఏ' వరం కావాలో కోరుకొమ్మంటే
బిడ్డ సుఖమే కావాలంటుంది అమ్మ
'ఐ'దేళ్ళ వరకు మొదటిగురువై
పాఠాలు చెబుతుంది అమ్మ
'ఒ'ంటరి తనంలో ఆత్మీయమైనతోడు అమ్మ
'ఓ'టమిలో ఓదార్పు అమ్మ
'ఔ'దార్యంలో అగ్రగణ్యురాలు అమ్మ
'అం'దనంత ఎత్తుకు నువ్వు ఎదగాలనుకుంటుంది అమ్మ
'అః' అంటూ అందరూ మెచ్చుకునే విధంగా
మసలుకోమంటుంది అమ్మ
ప్రేమకు అద్యంతాలు "అమ్మ".

# వయసా పరుగుతీయకు

వయసా! పరుగు తీయకు
ఈ జీవితాన్ని ఆస్వాదించడం
ఇంకా మొదలుపెట్టలేదు
అమాయకత్వంతో
గడిచిపోయింది బాల్యం
యవ్వనం తుళ్లింతలకు కళ్లెం వేసింది
మూడు ముళ్ల బంధం
ఆ బంధ మాధుర్యాన్ని చవిచూసేలోపు
ఒడిలో అమ్మతనం
బాధ్యతల బరువులో
కాలంతో పరుగులు
నానమ్మగా అమ్మమ్మగా
అవతారాల పర్వం
నా మీద నాకు హక్కులేకుండా
ఇతరులు శాసించినట్టు
గడిచిపోయింది జీవితం
తమకేదికావాలో
స్పష్టమైన అవగాహనతో
నచ్చిన రీతిలో
జీవితం గడుపుతున్న నేటితరాన్ని చూస్తే
అబ్బురమనిపిస్తోంది
నేనేమిటో
వ్యక్తిత్వమంటే ఏమిటో తెలియకుండానే
కాలప్రవాహంలో కొట్టుకుపోయా

"బెటర్ లేట్ దాన్ నెవర్"
ఇప్పటికైనా మించిపోయిందిలేదు
నీకిష్టమైన రీతిలో అర్థవంతంగా
జీవించడం మొదలుపెట్టు
అంతరాత్మ రొదపెడుతోంది
దానిమాట కూడ వినాలి కదా మరి
అందుకే!
అర్థిస్తున్నా!
వయసా! పరుగుతీయకు
ఈ జీవితాన్ని అస్వాదించడం
మొదలు పెట్టాలనివుంది.

(విశ్వసాహితి కవి సమ్మేళనములో చదివిన కవిత)

# వారు అస్థిత్వం కోల్పోయారు

"గ్యాస్ స్టవ్" రాకతో
పొట్టు పొయ్యి
అస్థిత్వం కోల్పోయింది
"మిక్సీ" రాగానే
తిరగలి
అస్థిత్వం కోల్పోయింది
"వెట్ గ్రైండర్" రాగానే
రుబ్బురోలు
అస్థిత్వం కోల్పోయింది
"నాన్‌స్టిక్ పాన్" రాకతో
పెనం
అస్థిత్వం కోల్పోయింది
"ఆంటీ" "అంకుల్" పిలుపుతో
"అత్తా" "మామలు"
అస్థిత్వం కోల్పోయారు
"మమ్మీ" "డాడీ" పిలుపుతో
"అమ్మా నాన్నలు"
అస్థిత్వం కోల్పోయారు

*('నేటి నిజం' లో ప్రచురితం)*

# అందరివాడు

నలుబది నిండకుండానే
ముఖ్యమంత్రి పదవి
నలుబది ఒకటి దాటకుండానే
జాతీయ కాంగ్రేస్ అధ్యక్ష పదవి
అర్ధశతం నిండకుండానే
అలరించినవి అనేక పదవులు
ఆ పదవులకే వన్నెతెచ్చి
అఖిల జనులకు మోదం కూర్చి
అందరి ఆమోదం పొందిన
మట్టిలో మాణిక్యం
దామోదరం సంజీవయ్య!

సుపుత్ర: కులదీపక: అన్నట్టు
మాతాపితలైన సుంకులమ్మ మునెయ్యలకు
సుపుత్రిడిగా
పిన్నవయసులోనే ముఖ్యమంత్రిగా
రాష్ట్రంలోనే కాక దేశంలోనే
మొట్ట మొదటి దళిత ముఖ్యమంత్రిగా
చరిత్రలో నిలిచిపోయావు
కన్నవారికీ, రాష్ట్రానికీ, దేశానికీ కూడ
పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టావు
కుతంత్ర రాజకీయ నాయకులను ఒక్కత్రాటిపై తెచ్చి
సర్వుల ఆమోదం పొందిన దామోదరుడిని

రాజకీయ సంక్షోభంలో
కొట్టు మిట్టాడుతున్న రాష్టానికి

సంజీవనివై ఊపిరి లూదిన సంజీవయ్యావు
నిస్పహాయు కన్నీటికి ఓదార్పుగా
ఆర్తజనవాళికి ఆశాదీపముగా
పల్లెనుండి పట్నం వరకు
ఆదర్శ మార్గం వైపు నడిపించావు
గాంధీజీ అడుగు జాడల్లోనడిచి
నిరాడంబర జీవితం గడిపిన
నిజమైన ప్రజానాయకుడివి
కేంద్ర మంత్రిగావున్నా, రాష్ట్ర ముఖ్యమంత్రిగావున్నా
సొంత గూడుకానీ, వాహనంకానీ లేక
సామాన్యుడిగా జీవించిన మాన్యుడివి
నేటితరం నాయకులకు ఆదర్శప్రాయుడివి

కార్మికుల పాలిట సంజీవనిగా
బోనస్ చట్టాన్ని అమలులోకి తెచ్చి
బోనస్ సంజీవయ్యగా వినుతికెక్కావు
అణచివేతకుగురవుతున్న రైతన్న
బాగుకోసం నడుంబిగించావు
బడుగుజీవి బ్రతుకు
ఒడ్డుకు చేర్చాలని అహరహం శ్రమించావు
నీతి పరిపాలన అందిద్దామని
నిరంతర పోరాటం సాగించావు

సాహిత్యానికీ రాజకీయానికీ
సరిపడదంటారు
ఆరెంటినీ ఔపోసనపట్టి
పాటలనూ పద్యాలనూ రాజకీయ
ఉపన్యాసాలలో మేళవించి

మనోరంజకంగా చేసిన
జనరంజకుడివి
కాకిలా కలకాలం కాకుండా
హంసలా బ్రతికి
ప్రజాజీవనంలో మమేకమయినావు
అన్నిటా నీవైనావు
అందరిమన్ననలు పొందావు

దామోదరా! నీ గురించి ఎంత చెప్పినా
తక్కువేనంటోంది నా కలం
నీ మాట మృదు మధురం
నీ గుణం విశిష్ట సంపన్నం
నీ రూపు మంచీ మానవత్వం
నీ బాట అనుసరణీయం
ఏమని పొగడుదు? సంజీవయ్యా

నీ జీవితం ఆదర్శప్రాయం
నీ ధ్యేయం కడు శ్లాఘనీయం
నీ జ్ఞాపకాలు నిత్యనూతనం
నీ జననం తెలుగుజాతికి గర్వకారణం
చంద్రుడికో నూలుపోగులా
అందుకో
నా అక్షర నీరాజనం.

*(ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ వారు దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో చదివిన కవిత, సంజీవయ్య పుస్తకంలో ప్రచురింపబడిన కవిత)*

# ఎక్కడోవున్నావనుకున్నా!

ఎక్కడో ఉన్నావనుకున్నా
పైనెక్కడో వున్నావనుకున్నా
అందనంత దూరాన వున్నావనుకున్నా
నిను చేరుట నా కసాధ్యమనుకున్నా
ఎక్కడో ఉన్నావనుకున్నా!

సప్తగిరులపై కొలువున్నావని
విజ్ఞులు చెప్పగ విన్నా
కలియుగదైవము నీవేనని
దైవజ్ఞులు చెప్పగ తెలుసుకున్నా!
ఎక్కడోవున్నావని అనుకున్నా
తిరుమలగిరిపై నినుగాంచి ధన్యతనొందా!

తలనీలాలెందుకు నీకని అనుకున్నా
మా తల పొగరు తగ్గించడానికని
తెలుసుకున్నా
నిలువు దోపిడీ చెస్తున్నావనుకున్నా
మా కోరికలకు కళ్లెం వేయడానికని
తెలుసుకున్నా
పొల్లుడు దండాలతో నీకు పనిఏమనుకున్నా
నశించే దేహంపై మమకారం తొలగించడానికని
తెలుసుకున్నా
ఆర్జిత సేవలెందుకని అనుకున్నా
సంచిత కర్మల క్షాళనకని
తెలుసుకున్నా

మాలో అహంకార మమకారాలను అణచి
సన్మార్గంవైపు నడిపిస్తున్నావని
తెలుసుకున్నా
ఎక్కడో నువు లేవని అనుకున్నా
మంచి చెడుల హెచ్చరిక చేస్తూ
మా అంతరంగంలోనే వున్నావని
తెలుసుకున్నా!

*(తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలో చదివిన కవిత, నేటి నిజంలో ప్రచురితం)*

# కొందరివాడు

అతడో పరోపకారి పాపన్న
కాలనీ వాసులందరి
కష్టసుఖాలు తెలుసుకుంటూ
అందరికీ తలలో నాలుకగా
సమయానికి ఆదుకునే ఆపద్బాంధవుడు
కాలనీ రోడ్లు బాగు చేయలన్నా
మునిసిపల్ నీళ్ళు రాకపోయినా
బాధ్యత తన భుజస్కంధాల మీద వేసుకుని
అందరిమన్ననలు పొందాడు
అందరివాడనిపించుకున్నాడు
ఇన్ని మంచి పనులుచేస్తున్న
ఇతడిని ఇతోథికంగా గౌరవించాలని
వార్డు కౌన్సిలరుగా ఎన్నుకున్నారు
అతని సేవా కార్యక్రమాలకు మెచ్చి
ఎం.ఎల్.ఎ. గా గెలిపించారు
జనాలకు కొంచెం దూరంగా జరగడం
మొదలు పెట్టాడు
మంత్రి పదవి వరించింది
ఎన్నుకున్న ప్రజలు
నమ్ముకున్న జనాలు
మసకమసగ్గా కనిపించారు
ముఖ్యమంత్రి అయాడు
భజనరాయుళ్ల మాయలోపడి
అందరికీ దూరమయ్యాడు
అందరివాడు కాస్తా
కొందరివాడయ్యాడు.

*(సాహిత్య ప్రవంతి కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# దేవుడు ఎదురు చూస్తున్నాడు

మా వీధి మొదలు నుంచి
వీధి చివర హనుమంతుడి కోవెలవరకు
ఎన్నెన్నో పాదముద్రలు
కోరికలే గుర్రాలయి
దేవుడి అనుగ్రహం కోసం
పాదాలను పరుగులు పెట్టిస్తుంటాయి
అధికారం కోసం కొన్నీ
దర్పం ప్రదర్శించడానికి కొన్నీ
ధనదాహంతో కొన్నీ
భయంతో కొన్నీ - భక్తితో కొన్నీ
అమ్మ కొంగు పట్టుకుని నడిచే
అమాయకపు చిన్నిపాదాలు కొన్నీ
ఉదయం నుంచీ రాత్రివరకు
ఎన్నో ఎన్నెన్నో పాదముద్రలు
అన్నీ కాల ప్రవాహంలో
కొట్టుకుపోతూనే వున్నాయి
అయినా మళ్లీ మళ్లీ
కొత్త కొత్త పాదముద్రలు
మనిషిని ఆశల పల్లకిలో ఊరేగిస్తూ
వాటి సాధనకోసం
దేవుడి గుడివైపు పదపద మంటూ
పరుగులు పెట్టిస్తుంటాయి
ఏ పాదాలు
దయాసారభాన్ని నింపుకుని
నిష్కామ హృదయంతో
ఆత్మార్పణ కానించడానికి వస్తాయోనని
దేవుడు ఎదురు చూస్తున్నాడు.

*(అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ వారు నిర్వహించిన సభలో చదివిన కవిత.)*

# సంస్కృతీ సాంప్రదాయాల గడప

కడపకెళ్తున్నాననగానే
"బాంబులేస్తారమ్మా జాగ్రత్త"
హెచ్చరించాడు సుపుత్రుడు
కడపంటే బాంబుల సంస్కృతేనా?
ఇంకేమి లేదా అనుకుంటూ
అంతర్జాలంలోకి (ఇంటర్‌నెట్) తొంగి చూశా
ఈ కడప సామాన్యమైనది కాదు సుమా!
తిరుమలేశుని సన్నిధి చేరుకునే
మొదటి మెట్టు
దేవుని కడప
కోదండరాముడు కొలువున్న
ఒంటిమిట్ట
అన్నమాచార్యుని పురిటిగడ్డ
తాళ్ళపాక
బమ్మెర పోతన భాగవతం
రచించిన గడ్డ
తనహృదిలో గర్వంగా
పొదువుకుంది కడప
ఈ కడప సామాన్యమైనది కాదు సుమా!
శ్రీశైలానికి దక్షిణ ద్వారం
పుష్పగిరి పీఠానికి నిలయం
బ్రహ్మంగారి మఠానికి మణిహారం
ఈ కడప ద్వారం

దేవుని కడపలో వేంకటేశ్వరుడు
శివలపల్లిలో కాశీవిశ్వేరుడు
చిల్మకూరులో ఆగస్థేశ్వరస్వామి
గండిలో అంజనేయస్వామి
నందలూరులో సౌమ్యనాథస్వామి
రాయచోటిలో వీరభద్రస్వామి
కొలువుండి కాపాడుతున్న
పుణ్యగడ్డ కడప

రామాయణం రచించిన మొట్టమొదటి
కవయిత్రి మొల్ల
సాహితీ విపంచి, అల్లికల జిగిబిగి
అల్లసాని పెద్దనలకు
జన్మనిచ్చిన సాహితీ నందనం కడప
పచ్చని పంటపొలాలు
చక్కని పంచకట్టులు
అచ్చ తెలుగుదనంతో అలరారే
సంస్కృతీ సాంప్రదాయాల వనం కడప

బహుదొడ్డ పారంపర్య చరిత్ర కలిగి
కవితా, సాహితీ, సాంస్కృతిక
సంబరాలతో
స్నేహ సౌరభాలు
వెదజల్లే జీవగడ్డ కడప

ఈ కడప సామాన్యమైనది కాదు సుమా!

అందుకే

హరిత ఆడిటోరియంలో జరుగుతున్న
డా॥ కవితా సాహితీ సంబరాలకు
ఆహ్వానం అందగానే
ఇంతటి ఘనచరిత్ర కలిగిన
కడపను చూడాలని
ఆత్రుతతో, ఆత్మీయతతో
వేంకటాద్రి పొగబండినెక్కి
దేవుని కడపకు
చేరుకున్నా!
సాదరంగా ఆహ్వానించి
ఆతిథ్యమిచ్చిన పిచ్చయ్య చౌదరిగారికి
కడప సాహితీ మిత్రులకు
ధన్యవాదాలు!

పూల మీద నుంచి వీచిన గాలి
పులకిత సుగంధం
కడప సజ్జన సాహితీ సాంగత్యం
సాహితీ ప్రియులకు మనోరంజకం.

*(కడపలో జరిగిన డా॥ కవితా సాహితీ సంబరాలలో సమర్పించిన కవిత)*

# బలహీన జనులము

కలియుగములో పుట్టిన మేము
కడుబలహీన జనులము
మంత్రహీనులము - తంత్రహీనులము
శక్తి హీనులము - క్రీయా హీనులము
నీ నామ స్మరణ తప్ప అన్యము తెలియదు
భక్తితోడ వేసిన తులసి దళమునకు తూగి
రుక్మిణి పాతివ్రత్యమును లోకమునకు చాటినావు
భక్తితో ఇచ్చిన గుప్పెడు అటుకులు తిని
కుచేలుని కుబేరునిగ చేసి ధన్యత చేకూర్చినావు
భక్తి పారవవశ్యమున ఎంగిలి పండ్లు తినిపించిన
శబరికి మోక్ష మొసగినావు
హనుమయ్య దాస్య భక్తికిమెచ్చి
ఎల్లవేళల అతని హృదయంలో కొలువుండినావు
భక్తి వశుడవు నీవని తెలుసుకొంటిమి
భక్తితో నీ పాదముల చెంత
శిరసువంచి మొకరిల్లెదము
తెలిసి తెలియక చేసిన తప్పులనుగాచి
కడతేర్చి మము దరి చేర్చుకోవయ్య
అన్యధా శరణం నాస్తి
త్వమేవ శరణం మమ
తస్మాత్ కారుణ్యభావేన
రక్ష రక్ష జనార్ధనా
రక్ష రక్ష పరమేశ్వరా!
ఓం తత్ సత్.

*(ఆలయవాణి వెబ్ రేడియాలో భక్తి సమ్మేళనలో ప్రసారమైనది.) (చేతన మాస పత్రికలో ప్రచురితం)*

# పంచుకోవడంలోని సౌఖ్యం

కడుపులోని బాధ
హృదయాన్ని బరువెక్కించి
గొంతులో కొచ్చి
పెదవుల ద్వారా
బహిర్గతమవాలని చూస్తోంది
వినే మనిషి కోసం
కనులు తహతహలాడుతూ
కలయ చూసాయి
టివి, కంప్యూటర్, సెల్ ఫోన్లే
ఊపిరిగా బతుకుతున్న
మరమనుషులు
బాధ పంచుకోవడం ఎరగని,
స్పందించడం తెలియని జీవులు
బాధ
పెదవులపై నుంచి గొంతులోకొచ్చి
హృదయంలోకి చొచ్చుకొని
చివరికి కడుపులోకి తిరోగమించి
సుళ్లు తిరుగుతూ
కళ్లు తిరిగి
బి.పి.లోకి దారి తీసింది
పంచుకోవడంలోని సౌఖ్యం
పంచుకోవడంలోని ఆనందం
పంచుకోవడంలోని ఆరోగ్యం
మరమనుషులకెలా తెలుస్తుంది.

# మా అపార్ట్‌మెంట్

మా అపార్ట్‌మెంట్ కట్టి
పదిహేనేళ్ళు అయినా
ఇప్పటికీ
గోడలకు మేకుదింపుళ్ళూ
పైపుల లీకేజీ రిపేర్లు
డ్రిల్లింగ్ మిషిన్ల మోతలు
సర్వసాధారణం
ఉదయాన్నే మా వాకిట్లో
పక్కవాళ్ల చెత్త బుట్ట సాక్షాత్కారం
బాల్కానీలన్నీ బట్టలతోరణాల నిలయాలు
కామన్ కారిడార్ దర్జాగా కబ్జాచేసి
చెప్పుల స్టాండ్‌లు -
పిల్లల ఆటపాటలు
ఆలుమగల సెండ్ ఆఫ్‌లు
చుట్టాలొచ్చారు నీళ్ళు సరిపోవడం లేదంటూ
వాచ్‌మెన్ మీద అరుపులు, హుంకరింపులు
ఆదివారం వచ్చిందంటే
బిర్యానీ ఘుమఘుమలు, మసాలా ఘాటులు
పిల్లల క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు
కొట్లాటలు, ఏడుపులు, సముదాయింపులు
అన్నీ హాల్లో కూర్చునే ఆశ్వాదించవచ్చు
నీటి సమస్య, లిఫ్ట్ ఆగిపోవడాలు లాంటివి వస్తే
సెక్రటరీని నిలదీస్తాం
సమస్య పరిష్కారానికి డబ్బులు వసూలు చేస్తుంటే

రేపురా మాపురా అంటూ వాచ్‌మెన్ తిప్పిస్తాం
కారిడార్లో మంచునే
కష్టసుఖాలు పంచుకుంటాం
పండుగలప్పుడు
పిండి వంటలు ఇచ్చి పుచ్చుకుంటాం
కొత్త సంవత్సరంలో
కేక్ కట్ చేసి శుభాకాంక్షలు
చెప్పుకుంటాం
ఆనందంగా ఆటపాటలు
నిర్వహించుకుంటాం
మళ్లీ ఎవరి గూటికి వారు చేరి
తలుపులు బిడాయించుకుంటాం
అపార్టుమెంటండీ
మాది అనుబంధాల
పందిరి అండీ
ఆనందిస్తే స్వర్గం
అసహ్యంచుకుంటే నరకం.

# తెలుగు భాషను నేను

నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ
గురజాడ, గిడుగు, శ్రీశ్రీ
కవిత్వాలలో తరించిన
తెలుగు భాషను

ఓం నమః శివాయః అంటూ
అక్షరాభ్యాసం నాడు రాయించి
మొగ్గగా వున్నప్పుడే
మోక్షానికి పునాది వేసిన
తెలుగు భాషను

కవిత్రయ కలంనుంచి
జాలువారిన మహాభారతంలో
విశ్వనాథ విరచిత రామాయణ
కల్ప వృక్షంలో తరించిన
తెలుగు భాషను

కృష్ణశాస్త్రి కవితల్లో
సినారె రచనల్లో
బాపు రమణుల చిత్ర రచనల్లో
ఘంటసాల గళంలోని మాధుర్యం గ్రోలిన
తెలుగు భాషను

రామదాసు నోట రామనామమై
త్యాగరాజు పాటలో భక్తి తరంగమైన
తెలుగు భాషను

మేధస్సుకు పదునుపెట్టే అష్టావధానం
చంధోబద్ధంగా రచించే పద్యం
సొంతమైన తెలుగు భాషను

కూచిపూడి నట్టువాంగంలో
బుర్రకథ సాహిత్యంలో
అన్నమయ్య కీర్తనలలో
క్షేత్రయ పదాలలో తనియాడిన
తెలుగు భాషను

తేనెకన్న తీయనైన
మల్లెకన్న చల్లనైన
వెన్నకన్న మృదువైన
మీగడకన్న మృదువైన
తెలుగు భాషను

అమ్మా అన్న పిలుపులోని ఆర్ద్రతను
అమ్మా అన్న పిలుపులోని అమృతాన్ని
అమ్మా అన్న పిలుపులోని ఆత్మీయతను
అమ్మా అన్న పిలుపులోని దివ్యత్వాన్ని
నేను తెలుగు భాషను

తెలుగు భాషను నేను
నిండుగ వెలుగు భాషను నేను.

*(ఆదర్శవాణి మాస పత్రికలో ప్రచురితం)*

# మన టంగుటూరి

తెలుగు జాతికి గర్వకారణం
మన టంగుటూరి ప్రకాశం
సామాన్యుడిగా పుట్టి అసామాన్యుడిగా
హిమాలయమంత ఎత్తుకు ఎదిగి
ప్రత్యేక తెలుగు రాష్ట్రానికి
ప్రప్రథమ ముఖ్యమంత్రిగా
జనరంజకంగా పరిపాలించి
ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన
ఘనుడు మన టంగుటూరి
ఒక్క సంవత్సరం మాత్రమే పదవి నలంకరించినా
అయిదేళ్లలో చేయలేని అభ్యుదయ కార్యక్రమాలు
చేసి చూపిన కార్యదక్షుడు
తప్పును తప్పనడానికి వెరవని ధీరత్వం
మంచి అన్నది చేయడానికి వెనుకాడని ధృడత్వం
కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి
వెనుకంజ వేయని కార్యశూరత్వం
సమస్యలెదురైనప్పుడు
నిర్భయంతో వ్యవహరించే స్థిత ప్రజ్ఞత్వం
టంగుటూరి వ్యక్తిత్వవైశిష్టం
గాంధీ నెహ్రూలాంటివారుసైతం
ఎదురు చెప్పలేని ఆత్మస్థైర్యం ఆయన సొంతం
నీతి నిజాయితీలే పెట్టుబడిగా
సంపాదించిన లక్షలాది ధనాన్ని
దేశ సేవకు, ప్రజా సంక్షేమానికి
మంచి నీళ్ల ప్రాయంగా ఖర్చుచేసిన

రాజకీయ సన్యాసి
స్వరాజ్య ప్రతిక స్థాపించి
ఆంగ్ల ప్రభుత్వాని
హడలెత్తించిన నిర్భీత
"ముందు నన్ను కాల్చి తరువాత నా వాళ్లను కాల్చండి"
అంటూ సైమన్ దొర తుపాకి గుండుకి
గుండెను చూపిన ధీరోదాత్తుడు
"ఆంధ్రకేసరి"గా వినుతికెక్కిన మేరునగ ధీరుడు
అడిగిన వారికి లేదనకుండా దానం చేసిన
అపర దానకర్ణుడు
త్యాగం, సాహసం, నిర్భయత్వం
సహనం, పట్టుదల, ఆత్మవిశ్వాసం
ఆయనకు కవచకుండలాలు
"ఒంగోలు జిల్లా" "ప్రకాశం జిల్లా" గా
పేరు మార్చుకుని ధన్యతనొందినది
సామాజిక, వ్యక్తిగత
క్రమశిక్షణ కలిగిన మహోన్నత వ్యక్తిత్వం
టంగుటూరి అస్థిత్వం
కాదు కాదు
ఆంధ్ర రాష్ట్ర ప్రకాశం
వారి దేశ భక్తి, కార్యశూరత్వం
భావితరాలకు ఆదర్శం
అందుకో ఆంధ్ర కేసరీ నీకివే
మా జోహార్లు.

*(చేతన మాస పత్రికలో ప్రచురితం, టంగుటూరి ప్రకాశం పంతులుగారి జయంతి సందర్భంగా పదసాహిత్య పరిషత్ వారి నిర్వహించిన కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# ఉగాది పురస్కారం

మరచిపోతున్న తెలుగు దనాన్ని
గుర్తుచేసే తొలిపండుగ
ఉగాది
వందరూపాయలకు
పదిమావిడాకులు కొని
గుమ్మానికున్న ప్లాస్టిక్ మామిడి తోరణాలపై కట్టి
గడపకున్న పసుపు రంగు మీద
కొంచెం పసుపు రాసి
ఎర్రని రంగుబొట్లమీద
కుంకుమ బొట్లు పెట్టి
ఉగాది లక్ష్మి వచ్చేసిందనీ
తెలుగుతనాన్ని కాపాడుకున్నాననీ
సంబరపడ్డా!
మాడుకి నూనె అంటుతానేమోనన్నా
భయంతో
గబుక్కున స్నానాల గదిలోకి దూరి
షాంపుతో తలరుద్దుకుని వచ్చారు
శ్రీవారు, పిల్లలు
ఉగాది పచ్చడి దేవునికి నివేదన చేసి
తలా కొంచెం పెట్టా
అమ్మా! ఇదేంటి ఇంత
చేదుగా వుంది ఈ పచ్చడి
ఈ సంవత్సరమంతా నాకు చేదు వార్తలేనేమో!

అమ్మాయి బాధ
నీకంతేలే!
నాకు మాత్రం భలే తీయగావుంది
ఈ సంవత్సరమంతా నాకు
మంచే జరుగుతుందంటూ
చెల్లిని ఏడ్పిస్తున్న సుపుత్రుడు
అన్నీ సమపాళ్లలో వుండాలి కానీ
ఇదేంటి ఇలావుందటూ
ఏది సమంగా లేదో చెప్పకుండా
శ్రీవారి గొణుగుడు
నేనేం సొంతంగా చేయలేదు
రెడీమేడ్ కొన్న ఉగాది పచ్చడి
పాకెట్‌లో ఇచ్చిన
కొలతల ప్రకారమే చేశాను
తప్పంతా అమ్మినవాడి మీద వేసి
“త్వరగా బయలు దేరండి
గుడికెళ్లివద్దామని అందరినీ
బయలుదేర దీసేసరికి
తలప్రాణం తోక కొచ్చింది
తెలుగువారి పరభాషా వ్యామోహానికి
గుర్తుగా ‘విష్ యు హేపీ ఉగాది’
దారి పొడవునా పరిచయుస్తుల
శుభాకాంక్షలతో గుడికి చేరుకున్నాం
గుడిలో చాంతాడంత వరసలు చూసి
శ్రీవారి రుసరుసలు
ఆకలేస్తుదంటూ పిల్లలు విసవిసలు

తొక్కుకుంటూ తోసుకుంటూ
ఎలాగో అలాగ దర్శనం అయిందనిపించుకొని
అమ్మయ్య! ఓ పనయింది
ఇక సంవత్సరమంతా
గుడికెళ్ళినంత ఫలితం
ఏదో సాధించినంత సంతోషం కలిగింది
ఇంటికి వస్తూనే బుల్లితెరముందు
తిష్టవేశారు
పంచాంగ పఠనం వస్తోంది
ఎవరి రాశి ఫలితాలు
గురించి వారికి ఆదుర్దా
ఎవరినీ అసంతృప్తి పరచకూడదని
ఒక్కొక్క రాశికి ఒక్కొక్క పంచాంగంలో
బాగా రాశారు పంచాంగ కర్తలు
తరువాత దూరదర్శన్‌లో
కవిసమ్మేళనం మొదలైంది
కులమతాలు పోవాలి
అవినీతి అంతరించాలి
యువతరం పూనుకోవాలి
మరో మహాత్ముడు పుట్టాలి అంటూ
కవుల కవితా పఠనం సాగుతోంది
వచ్చే వుగాది కల్లా సమాజంలో
సమూల మార్పులు తెస్తాం
తెలుగు భాషకు మహర్దశ తెస్తాం
అంటూ ముఖ్య అతిథి ఆంగ్లభాషలో
ఉపన్యాసం దంచి

కవులకు సత్కారం చేశారు
ఇంటిల్లపాది ఆకలి తీర్చే
బాధ్యత సొంతం చేసుకుని
ఒక చెవితో కార్యక్రమాలు వింటూ
మామిడికాయ పులిహోర
వేడి వేడి గారెలు, అల్లం చెట్నీ చేసి
పళ్లాలను అందించా!
"వావ్! అమ్మా ఎప్పుడు చేశావివన్నీ
చాలా బావున్నాయి"
"అమ్మా, యు ఆర్ గ్రేట్" అంటూ
నావంక సంతోషంగా
ప్రశంసా పూర్వకంగా చూసిన చూపులు
నా ఆకలి మరిపించి
నన్ను పట్టు శాలువాతో సత్కరించి
ఉగాది పురస్కార మిచ్చినంత
సంబరం కలిగింది.

# ఆనందం మనసొంతం

లక్ష్యాలను చేరుకోలేదన్న దిగులు ఒకరిది
ప్రేమ విఫలమైందన్న బాధ
వ్యాపారంలో ఎదురుదెబ్బతిన్న చేదు అనుభవం
డిగ్రీల మీద డిగ్రీలు చేసినా
సరైన ఉద్యోగం రాక నిరాశ
ఎంత విద్వత్తు వున్నా
గుర్తింపులేదన్న వైరాగ్యం
అన్నీవున్నా ఇంకా ఏదోకావాలన్న అసంతృప్తి
కారణం ఏదైతేనేం
నిరాశ నిస్పృహలు అందరిలోను
అసంతృప్తితో గడిపే జీవితాలు
తమకేదో తక్కువైందని
ఏదో లేదని బాధపడేవారు
ఏమిలేని నిర్భాగ్య జీవితాలనుంచి
స్ఫూర్తి తెచ్చుకోవాలి
ఉన్నదానితో తృప్తి పడటం నేర్చుకోవాలి
నలుగురితో పంచుకోవడం
అలవరచుకోవాలి
ఇవ్వడంలోని తృప్తి
పంచుకోవడంలోని సంతృప్తి
ఉదాసీన జీవితాల్లో ఉత్సాహం నింపుతాయి
వారి ముఖల్లో తొణికిసల్లాడే
కృతజ్ఞతా భావంలో తడిసినప్పుడు
ఏదో సాధించినంత సంబరం
అంబరమంత ఆనందం మన సొంతం.

*(సాహిత్య స్రవంతి కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# చూపుడువేలు

మనలో స్వార్థముంచుకుని
ఎదుటివాడిని వేలెత్తి చూపుతున్నాం
మన బుద్ధిని బురదలో తొక్కేసి
ఎదుటి వాడి తెలివికి అసూయపడుతున్నాం
అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతూ
ఎదుటివారి విజ్ఞానానికి ఈర్ష్యపడుతున్నాం
తృప్తిలేని జీవితం గడుపుతూ
ఎదుటివాడి సంతృప్తిని సహించలేకపోతున్నాం
"నేను" అనే అహంకార భావంతో
"మేము" అనే సామరస్య భావాన్ని మరచిపోతున్నాం
"ఎదుటివాడిని చూసి
ఓర్వలేని తనం కాదు
నీలోకి నువ్వుతొంగి చూసుకో
అశాంతికి మూలమెక్కడుందో తెలుసుకో"
అంతరాత్మ గోలపెడుతూనే వుంటుంది
దాన్ని జోకొడుతూ
అతితెలివిగా
బతికేస్తున్నాం.

*(సాహిత్య ప్రవంతి కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# నిద్ర

ఆడ శిశువుగా జన్మించినందుకు
తల్లిదండ్రుల ఏడుపు
నిద్ర పోనీయలేదు

బాలిక నయ్యాక
అరవ చాకిరీ
నిద్ర పోనీయ లేదు

కన్నెనయ్యాక
వెకిలి చూపులు
నిద్రపోనీయలేదు

మగనాలినయ్యాక
మగడు
నిద్రపోనీయలేదు

తల్లినయ్యాక
పిల్లలు
నిద్రపోనీయలేదు

అవ్వనయ్యాక
ఆయాసం
నిద్రపోనీయలేదు

ఎన్నాళ్లనుంచో తీరనికోరిక
హాయిగా ఆదమరచి నిద్రపోవాలని
ఆ కోరిక తీరేది బహుశః
మృత్యు దేవత ఒడిలోనే నేమో?

# నవయుగ వైతాళికుడు - గురజాడ

పేరులోనే ఉన్నది పెన్నిధి
అతడి పేరు వినగానే
గుర్తుకొస్తుంది కన్యాశుల్కం
అతడి పేరు వినగానే
గుర్తుకొస్తుంది
పుత్తడి బొమ్మ "పూర్ణమ్మ"
వారే మధురవాణి పాత్ర సృష్టికర్త
మహాకవి గురజాడ
విశ్వసాహిత్యంలో మధురవాణి
పాత్రను
పోల్చదగినది లేదని
అది మహాకవి గురజాడకే
చెల్లంటూ
ప్రస్తుతించారు మరో మహాకవి
శ్రీశ్రీ
కాలం కన్నా ముందు పరిగెట్టేవి
ఆయన ఆలోచనలు
"మహిళ మానవ చరిత్రను తిరగరాస్తుందని"
వందేళ్ల ముందే ఊహించిన
ఒక గొప్ప దార్శనికుడు
స్వరాజ్య ఉద్యమం పురుడు
పోసుకోకముందే
"దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి"

అన్న నవయుగ వైతాళికుడు
"మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండె కులములు"
అని ప్రవచించిన సంఘ సంస్కర్త
"ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును"
అని నొక్కి చెప్పిన తాత్వికుడు
దార్శనికత, తాత్వికత,
మానవీయత
కలగలిపిన సమగ్ర సాహితీవేత్త
తెలుగు ఆధునిక సాహిత్యానికి
మార్గదర్శి మన గురజాడ
మహాకవి, యుగకర్తా
భావితరానికి జీవశక్తీ
మన గురజాడ
"గంగి గోవుపాలు గరిటెడైనను చాలు" అన్న చందాన
రాసినది అతి కొద్ది
సాహిత్యమైనా
తెలుగు జాతి వున్నంత వరకూ
పదిలంగా కాపాడుకోవాల్సిన
సాహితీ సంపద
మన గురజాడ.

*(చేతన మాస పత్రికలో ప్రచురితం)*

# నిత్యయవ్వనుడు

పేరులో శివుణ్ణీ హృదిలో దామోదరుడ్నీ
పొదువుకున్న ఆధ్యాత్మిక వేత్త
సాహితీ భీష్మ పితామహులు
పోతుకూచి సాంబశివరావుగారు
ఆనాడు ముఖ్యమంత్రి సంజీవయ్యతో
కవిసమ్మేళనంలో పాల్గొన్నారు
అంతే వుత్సాహంతో ఈనాటి
యువతతో పోటీపడుతున్నారు
నిత్య నూతనం వారి కవిత్వం
వారు స్పృశించని సాహితీ ప్రక్రియలేదు
అందుకోని బిరుదులేదు
నాటక, జ్యోతిష, వాస్తు శాస్త్రాలను
అవపోసన పట్టిన పండితోత్తముడు
'విశ్వసాహితీ' సంస్థ స్థాపించి
88 ఏళ్ల వయసులో కూడా
నిత్యనూతన ఉత్సాహంతో
కార్యక్రమాలు నిర్వహిస్తున్న
నిత్య కృషీవలుడు
నిగర్వి, నిత్య సంతోషి, నిరంతర కృషి
వారి ఆరోగ్య రహస్యం
వారు ఇలాగే ఆరోగ్యంగా
ఆనందంగా, ఆహ్లాదంగా
శతవసంతాలు జీవించి
సాహితీ ప్రియులందరికీ
స్ఫూర్తిదాయకంగా ఉండాలని
ఆ దామోదరుడిని ప్రార్థిస్తూ
జీవన సాఫల్య పురస్కారాన్నందుకున్న సందర్భంగా
శుభాకాంక్షలు తెలియచేస్తూ
చంద్రునికో నూలుపోగులా
ఈ చిరు సత్కారం.

*(అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ వారు నిర్వహించిన పోతుకూచి సత్కార సభలో చదివిన కవిత)*

# అలసిన పుడమి తల్లి

సహజ సిద్ధమైన వనరులతో
పచ్చని పొలాలను పండించి
పండ్లూ పూలతో ప్రకృతిని అందంగా తీర్చిదిద్ది
మనిషి మనుగడగను
మనోరంజకం కావించిన పుడమితల్లి
నేడు కృత్రిమ ఎరువులతో
సహజత్వాన్ని కోల్పోయింది
భూగర్భ జాలాల కోసం
గుండెలోతుల్లో గునపాలు దింపుతుంటే
కన్నీటి వరదయై ఎగిసిపడుతోంది
ఖనిజ సంపద వేటలో కడుపులో
డైనమైట్లు పేల్చి హింసిస్తుంటే
గర్భ విచ్ఛితి జరిగి అల్లాడిపోతోంది
మల మూత్రాలు విసర్జించినా
కాండ్రించి వుమ్మినా
తన బిడ్డలే కదాని ఓర్మివహించి
బంగరు సిరుల నందించే తల్లి
ఇప్పుడు పచ్చదనం కోల్పోయి
యవ్వన హొయిలు కనుమరుగయి
వృద్ధాప్యపు పొడలతో అలసినట్టనిపిస్తోంది
అయినా సహజ సిద్ధమైన మాతృప్రేమతో
ఎండిన స్తనాలను సైతం
కసాయి బిడ్డల నోటికందించాలని
తపనపడుతున్న పిచ్చితల్లి
త్యాగమే కానీ స్వార్థమెరుగని పుడమి తల్లి.

# కన్నీటికి మానవ రూపం

చాలా కాలం తరువాత
ఊరుని పలకరిద్దామని వచ్చా
కనుచూపు మేర ఎక్కడా పొలాలు
కానరాలేదు
పొలాలన్నీ
ఇళ్ల స్థలాలుగా మారాయి
రాంబాబుగాడి పచ్చని పొలాల్లో
నల్లని పొగ బారిన మెకానిక్ షెడ్డులు
అవతారమెత్తాయి
మా పంట పొలాల కోసం
ఆతృతగా చూశా
ఆత్మీయంగా పలకరిద్దామని
ఎండిన 'బోరు' వైపు
బీటలు వారిన నేలవైపు చూపి
భోరుభోరున విలపిస్తూ
కన్నీటికి మానవ రూపంగా
కనిపించాడు రైతన్న
యజమానికి తన కష్టాన్ని నివేదించి,
తన పనయి పోయిందని
కరెంటు స్తంభానికి ఉరేసుకున్నాడు
అన్నం పెట్టే రైతన్న.

# రేపటి సుఖం

తన సుఖం చూసుకోకుండా
పైసా పైసా కూడబెట్టి
పట్నంలో పెద్ద చదువులు
చదివించాడు
మానాన్న ఆశలు వమ్ముచేయక
కష్టబడి చదివి పెద్ద వుద్యోగంలో స్థిరపడ్డాను.
నేను కూడ సంపాదించేది
నాబిడ్డ కోసమేకదా!
వాడికి ఏలోటు లేకుండా
ఆటాపాటలకు అలవాటుపడకుండా
నర్సరీనుంచే కార్పొరేట్ బడిలో
చేర్పించి చదివించా
కాలేజీకొచ్చిన కొడుకు
విచ్చలవిడిగా ఖర్చుచేస్తున్నాడు
నిలదీసే సరికి
మీనాన్న జీవితాన్ని అనుభవించక
కష్టపడి కూడబెట్టారు నీ సుఖం కోసం
ఆయన అడుగు జాడల్లో నడిచి
నువ్వు కూడా
రాత్రనక పగలనక శ్రమించావు
అమ్మనాన్న
మురిపాలకు నోచుకోకుండా
రెండేళ్ల నన్ను
కార్పొరేట్ నర్సరీలో చేర్పించి

రేపటి నా సుఖం కోసం
పునాది వేసానని సంబరపడ్డావు
రేపటి నీ సుఖం కోసం 'మీనాన్న'
రేపటి నా సుఖం కోసం 'నువ్వు'
తాపత్రయపడి
జీవితాన్ని అనుభవించకుండానే
అవసాన దశ కొచ్చేశారు
నేను పుట్టింది మొదలు
ఆడింది ఆటగా పాడింది పాటగా
గారాబంగా పెంచి
కష్టపడి సంపాదించే డబ్బు
విలువ తేలీకుండా చేశారు
డబ్బు మంచినీళ్ళలా ఖర్చు చేస్తున్నానంటూ
ఇప్పుడు వగచి లాభమేంటి?
మా కాళ్ళ మీద మేము
నిలబడేటట్టుగా పెంచండి
సోమరులుగా కాకుండా
కష్టపడే గుణాన్ని అలవరచండి
రేపటి పౌరులుగా
తీర్చిదిద్దండి."
కొడుకు చేత
పాఠాలు చెప్పించుకున్నా!

# తృప్తి

నాడు రాచపుండు
నేడు కాన్సర్
మనిషి మేధస్సు ఎన్ని కనిపెట్టినా
కాన్సర్‌ను జబ్బును
సంపూర్ణంగా నయం
చేయలేకపోతోంది
దీని చికిత్సకు చాలా
ఖర్చువుతుంది కాబట్టి
బహుశ రాచపుండన్నారేమో!
బ్రెస్ట్ కాన్సర్, త్రోట్ కాన్సర్
లంగ్ కాన్సర్, బ్లడ్ కాన్సర్
గర్భాశయ కాన్సర్, రెక్టమ్ కాన్సర్
ఇందుగలడందు లేదన్న
సందేహం లేకుండా
శరీరంలోని అన్ని భాగాలను
కబళించి
పీల్చిపిప్పి చేసి
జీవచ్ఛవంలా చేస్తోంది
నా నెచ్చెలి రమ
పదవీ విరమణానంతరం
హాయిగా వుందామనుకున్న
తరుణంలో
బ్రెస్ట్ కాన్సర్‌కు లోనయి
ఎంతో మనోధైర్యంతో

ఎదురించి పోరాడింది
తానొకటి తలిస్తే
దైవ మొకటి తలిచాడన్నట్టు
చివరికి మృత్యువు కోరలకి బలయింది
స్నేహానికి ప్రతి రూపమైన రమ
ఆసుపత్రిలో
కదలలేని స్థితిలో వుండి కూడా
చూడడానికి వచ్చిన నన్ను
చిరునవ్వుతో పలకరించిన
స్థిత ప్రజ్ఞురాలు
ఆరోజే "డి.టి.పి." అయి వచ్చిన
"తృప్తీ నీ వెక్కడ" కవితా సంపుటిని
మా స్నేహానికి గుర్తుగా
రమకు అంకితమిచ్చి చూపించాను
ఆమె కన్నుల్లో కదలాడిన
ఆనందం, స్నేహ పరిమళం, సంతృప్తి
నేనెన్నటికీ మరవలేను
తనను చూడ వచ్చిన వారందరికీ
ఆ పుస్తకాన్ని చూపించి
చిన్న పిల్లలా సంబరపడింది
నా కెంతో తృప్తిగా అనిపించింది
"తృప్తీ నీ వెక్కడ" పుస్తకాన్ని అంకితం తీసుకుని
తన జీవితాన్ని భగవంతుడికి అంకిత మిచ్చి
తృప్తిగా కనులుమూసింది.
నాబాధా తప్ప హృదయానికి
చిరు తృప్తి.

# చీకటిని ఊడ్చిన సూరీడు

తూరుపు పురుడు పోసుకుని
ఎర్రని సూరీడు
ఉదయించాడు
చీకటిని ఊడ్చి
లేకిరణాలతో
ముగ్గులు వేశాడు
చరాచరా సృష్టిని
మేలుకొలిపాడు
సహజ కాంతితో
ప్రకృతిని పరవశింప చేశాడు
కిరణ జన్య సంయోగంతో
పాడి పంటలకు అండగా నిలిచాడు
అలసి సొలసి పడమటకు
నడుము వాల్చాడు
దినకరుడికి
విశ్రాంతి నివ్వాలని
నెలరేడు తొంగి చూశాడు.

# ఎంత చక్కని దోయి

సాయం సంధ్యలో
పరిమళము మోసుకొచ్చాడు
మలయపవనుడు
ఆకసమున పొడసూపిన
వెలుగుచుక్కలు
చుక్కల నడుమ
చక్కనైన వెన్నెల రేడు
కలువకొలనులో
కనువిందు చేసెడి
వెన్నెల వెలుగులు
ఎంత చక్కనిదోయి
ఈప్రకృతి.

# అనురాగ భరితం

భట్రాజు వంశకీర్తి శ్రీనివాసుడు
వృత్తిరీత్యా శస్త్ర వైద్యుడు
ప్రవృతి రీత్యా సాహితీ ప్రియుడు
చిరునవ్వు ముఖారవిందం
అలుపెరగని విధినిర్వహణ
అతని పట్టపు రాణి 'రాణి'
పాలునీళ్లవలె కలిసిన జంట
ఆప్యాయతకు మారుపేరు అతడు
అన్నపూర్ణవలె వండి వడ్డించి
అతిథి అభ్యాగతులను ఆదరించు ఆమె
నలుగురన్నల ముద్దుల చెల్లి
పుట్టినింటి గారాబు పట్టి
శ్రీనివాసుని చేయి బట్టి
మెట్టినింటిని చేసింది హరివిల్లు
భర్తను వెన్నంటి
అమెరికాకు వలస వెళ్ళినా
మాతృ భూమి మమకారాన్ని మరవని
మహిళా రత్నం రాణి
వేడి వేడి బిర్యాని - కరకరలాడే పకోడి
కమ్మని వడ - చల్లని ఆవడ
ముద్దపప్పు - ఆవకాయ
ఘుమ ఘుమలాడే సాంబారు
అమెరికాలో ఆంధ్రా వంటకాలు
క్షణాల మీద చేసిపెట్టే కామధేనువు 'రాణి'

ఆప్యాయంగా వడ్డించే 'శ్రీనివాసుడు'
ఆత్మీయత వారి ఇంటిపేరు
అనురాగం వారి చిరునామా
వెరసి "రాణీ శ్రీనివాసుల దాంపత్యం"
వీరిరువురు కలకాలం
ఆనందంగా ఆహ్లాదంగా
మనుగడ సాగించాలని
మనసారా కోరుకుంటున్నా!

*(మే 24-26 వరకు తానా సభలకు అమెరికా డల్లాస్ నగరానికి వెళ్ళిన సందర్భంగా వీరి ఇంటి ఆతిధ్యాని స్వీరించినపుడు రాసిన కవిత)*

# సాహిత్యమంటే

సాహిత్యమంటే
అక్షరసముదాయంకాదు
మనిషి మస్తిష్కంలో
చొచ్చుకుపోయి
మానవతారాగాలు
పలికిస్తుంది
రాలిన స్వప్నాలకు
కొత్త చిగుళ్ల తొడిగిస్తుంది
పతనమవుతున్న విలువలపట్ల
ఖడ్గంగా మారి ఖండిస్తుంది
మాటల్లోని శబ్దాన్ని
మౌనంలోని భావాన్నీ
పాటలోని హాయినీ
పరువంలోని వయ్యారాన్నీ
కమనీయంగా
దర్శింపచేస్తుంది
ఉదయిస్తున్న సూర్యుడి
వెచ్చని కిరణాలను
పండువెన్నెల పరుస్తున్న
చంద్రుడి చల్లదనాన్ని
ఆహ్లాదంగా
కవిత్వీకరించి
అనుభవింపచేస్తుంది.

# పాఠక పాత్ర

కవిత్వం రాయడం
మొదలు పెట్టినప్పుడు
కవిత్వాన్ని
విమర్శించేవాడిని
రాయడం
మొదలు పెట్టాక
తెలిసింది
లోని భావాన్ని
భావస్ఫోరకంగా
పాఠకులు
ఆశ్వాదించే రీతిలో
స్పందించే విధంగా
పదాలను కూర్చి
కవితలల్లడం
అంతసులువుకాదని
ఇప్పుడు
కవిత్వాన్ని
విమర్శించే వారిని చూసి
పాఠక పాత్ర బహు సులువని
తెలుసుకున్నా....

# కలలు

కలలు కనని
జీవితం ఎందుకు?
కలలు కనాలి
ఆ కలలను
నిజం చేసుకోడానికి
శ్రమించాలి
కలలకు
పేద గొప్ప భేదాలుండవు
కుల గోత్రాలు తెలియవు
కటిక నేలయినా
పట్టు పరుపయినా ఒకటే
కూటికి నోచకోకపోయినా
కోటీశ్వరుడైనట్టు
కలగనవచ్చు
కానీ
ఆకలలకు కూడా
నోచుకోని
అభాగ్యపు చిన్నారులెందరో.

# రాత్రి 12 గంటలకు

రాత్రి 12 గంటలకు
పాప ఏడుపుతో
బాలింతకు
నిద్ర కరువు

రాత్రి 12 గంటలకు
సాఫ్ట్ వేర్
కుర్రాళ్లకి
నిద్ర కరువు

రాత్రి 12 గంటలకు
ఏ ఇంటికి కన్నవేయాలనే ఆలోచనతో
దొంగకి
నిద్ర కరువు

రాత్రి 12 గంటలకు
ఖళ్లు ఖళ్లు దగ్గుతో
తాతకు
నిద్ర కరువు

రాత్రి 12 గంటలకు
రేపు ఎలాగడుస్తుందోనని
సామాన్యుడికి
నిద్ర కరువు.

# స్వాగతం ఉగాదీ స్వాగతం

ప్రకృతిని మోడుల్లా మార్చిన
శిశిరానికి వీడ్కోలు పలికి
లేలేత చిగురుల సొగసులతో
కొత్త పెళ్ళి కూతురిలా
ముస్తాబై వచ్చిన వసంతమా!
స్వాగతం - నీకు - స్వాగతం
నిన్నటి ఖేదాన్ని మరచి
నేటి ఆనందాన్ని ఆశ్వాదించమని
ఆశాగీతమాలపిస్తూ అడుగిడిన
ఉగాదీ - నీకు - స్వాగతం
పచ్చని ప్రకృతికి పరవశిస్తూ
కోకిలమ్మ 'కుహకుహ' గానంతో
వీనుల విందు చేయిస్తూ
మదిని హాయిలో ఓలలాడిస్తూ
వేంచేసిన ఉగాదీ! స్వాగతం
రక్త వృద్ధి చేసే తీయని బెల్లం చింతపండు పులుపు
మామిడి వగరు ఉప్పు కారం
కలగలిపిన ఉగాది పచ్చడి
జీవితమంటే షడ్రుచుల సమ్మేళనమనీ
మనుగడ తెలిపే మహాభాష్యమనీ
పరమార్థాన్ని తెలిసిన
ఉగాదీ! నీకు స్వాగతం
మల్లెపూల గుబాళింపులు
మామిడి పళ్ల నిగారింపులు

మూడు ముళ్ల ముహూర్తాలు
ముంగిట్లో మంగళ వాయిద్యాలు
అన్ని శుభాలకు నాంది అయిన
ఉగాదీ! నీకు స్వాగతం
రాశిఫలితాలు - రాజపూజ్యావమానాలు
తిథి వారనక్షత్ర కరణ యోగాలు
తెలిపే పంచాంగ పఠనం శ్రవణం
మహాఫల ప్రసాదమనీ
గ్రహాల అనుగ్రహం పొంది
సుఖ జీవనం సాగించమనీ బోధించే
ఉగాదీ! నీకు స్వాగతం
రావణ సంహారం కావించి
సీతాసమేతుడై శ్రీరాముడు
అయోధ్యకు విజయం చేసిన
జయదినమైన ఉగాదీ! నీకు స్వాగతం
ఋతురాజైన వసంతుడిని పూజించి
పరమేశ్వరానుగ్రహం పొందగలిగే
శుభదినమైన ఉగాదీ! నీకు స్వాగతం
ఆధునికత సాంప్రదాయ శిరస్సుకు తుంచేస్తున్నా
పులకించిన ప్రకృతిలో
పరమాత్మని దర్శించి ఆరాధించడమనే
గొప్ప ఆధ్యాత్మిక సంస్కృతి
ఈ పండుగ ప్రాశస్త్యమనీ
ఈ పండుగలోని అంతరార్థమనీ
తెలిపే ఉగాదీ! నీకు స్వాగతం - సుస్వాగతం.

*(భక్తి టివి వారు నిర్వహించిన శ్రీ విజయనామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# ప్రజాస్వామ్యాన్ని నడిపించేది

మనది ప్రజాస్వామ్య దేశమని
ప్రపంచంలోనే అతిపెద్ద
ప్రజాస్వామ్య దేశమని
చాలా గర్వంగా వుండేది
కానీ నేడు
ఆ ప్రజాస్వామ్యాన్ని నడిపించేదెవరు?
ప్రజలా? ప్రభుత్వమా?
నాయకులా? ఎన్నికలా?
కాదు - కానేకాదు
వీళ్లందరికీ అతీతంగా
నిశ్శబ్దంగా చాపకింద నీరులా
ప్రజాస్వామ్యాన్ని నడిపిస్తోంది
మద్యం మాఫియా
ఎన్నికల్లో ఓటర్లను
ప్రజా పథకాలతో
ఆకట్టుకునే పనిలేకుండా
మద్యాన్ని వజ్రాయుధంలా ప్రయోగించి
విజయ ఢంకా మోగిస్తున్నారు
బినామీ పేర్లతో
మద్యదుకాణాలు నడుపుతున్న
నాయకుల తీరు
కంచే చేను మేస్తున్న చందానవుంది
ప్రభుత్వ ఆదాయం
పెంచుకోవడానికి
మద్య వ్యాపారం

పెట్టని కోటలా మారింది
తాగు నీరు లేని పల్లెల్లో సైతం
మద్యం ఏరులై పారుతోంది
బిచ్చగాడి నుంచీ
బిలియనీరుదాకా
అందరినీ
దాసోహం చేసుకుంటోంది
కాలేజీల్లో, క్లబ్బుల్లో, ఆఫీసుల్లో
గెట్ టుగెదర్ పార్టీల్లో
ఇందుగలడందు లేదను చందాన
తన కోరలను విస్తరిస్తూ
జనాన్ని వివసుల్ని చేస్తూ
విలువల వలువల్ని
నడిబజార్లో వేలంవేస్తోంది
దేశానికి వెన్నెముకలయిన
యువకులు మద్యానికి బానిసలై
నిర్వీర్యమవుతున్నారు
మద్యం మద్యం మద్యం
ఈ మద్య రక్కసిని
మట్టుపెట్టే వారేలేరా?
ఆవేశంతో ఆవేదనతో
ఆక్రోశం పెల్లుబికి కలం చేతపట్టా
మద్యరహిత సమాజం కోసం నడుం బిగించా
రేపటి తరాన్నైనా
కాపాడుదామన్న తపనతో.

*(సాహిత్య స్రవంతి కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# అందమైన పిల్లి

గోధుమ రంగులో పొడుగాటి చారికలతో
అందమైన పిల్లి మా అపార్టుమెంటులో
మొహమాటం లేకుండా ఇల్లిలూ తిరుగుతూ
పొట్ట పోసుకుంటుంది
డ్రాయింగ్ రూములో అందరం కూర్చుని
మాట్లాడుకుంటూ వుండగానే
మా కళ్లు కప్పి మెల్లిగా, మెత్తగా
అడుగులో అడుగు వేసుకుంటూ
వంటగది సమీపిస్తుంది
"ష్" అనగానే
వులిక్కిపడి వెనక్కితిరిగి వెల్తునట్టు నటిస్తుంది
ఏమరుపాటుగా వున్నామేమోనని గమనిస్తూ
మళ్లీ వంటింట్లోకి దూరడానికి ప్రయత్నిస్తుంది
సరిగ్గా ఏదైన ముఖ్యమయిన
పనిమీద బయలుదేరుతుంటే
ఎవరో పరుగుపందెం పెట్టినట్టు
కారు కడ్డంగా పరుగుతీస్తుంది
"ఛీ" ఇవాళ పనయినట్టే నుదురు కొట్టుకుని
వెనక్కి వచ్చి, కాసేపు కూచుని
మంచినీళ్లు తాగి అటు ఇటూ చూసి
పిల్లి లేదని నిర్ధారించుకుని
బయలు దేరడమవుతుంది
పిల్లీ, నేను ఇలా దొంగా పోలీసు ఆట
ఒకసారి పిల్లి దొంగయితే
మరోసారి నేను.

# చెట్టు నేర్పిన అక్షరాలు

ఆ వూరి మధ్యలో
తాతలు నాటిన చెట్టు
ఆ చెట్టు తన ఒడిలో
ఎందరో అనాథలకు పురుడుపోసింది
చిన్నారులను తన కొమ్మలనే
ఊయలగాచేసి ఊగించింది
ఎందరో బాటసారులకు
నిలువ నీడనిచ్చింది
తీయని ఫలాలతో కడుపు నింపింది
ఆవూరిలోని పెద్ద మనుషులంతా
ఆ చెట్టు కింద దోబుచులాడిన వారే!
అంతేకాదు
ఆచెట్టు తన ఒడినే బడిగా మార్చి
అక్షరాలకు పురుడు పోసింది
ఆ బడిలో అక్షరాలు దిద్దినవారు
ఇంజనీర్లుగా, డాక్టర్లుగా
ప్రొఫెసర్లుగా, కలెక్టరుగా
మేధావులుగా, నాయకులుగా
ఎదిగారు
ఆ నీడన అక్షరాలు
దిద్దినవారంతా కూడి
అక్షరాస్యతా దినోత్సవాన్ని
జరుపుకుని
ఆ వృక్షరాజానికి జేజేలు పలికారు
అక్షర నీరాజనాలు సమర్పించారు.

*(సాహితీ స్రవంతి వారు "అక్షరం" మీద నిర్వహించిన కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# మా ఇంట్లో

మా ఇంట్లో
ఎప్పుడూ
నిశ్శబ్దం
రాజ్యమేలుతుంటుంది
అందుకే
గిన్నెలు
మాట్లాడు కుంటాయి
వాటి బుగ్గలు
సొట్టలు పడుతుంటాయి.

# ఈ రోజు

ఎందుకో ఈ రోజు
నాహృదయం
పట్టలేని ఆనందంతో
ఎగిసి పడుతూ
ఆనంద భాష్పాలు రాలుస్తోంది
నాలాగే ఆలోచించి
తన వ్యధాభరిత హృదయాన్ని
కవితాత్మకంగా ఆవిష్కరించిన
కవితను చదివాను
అందులో నన్ను నేనుచూసుకున్నాను
నాలా ఆలోచించే మరో తోడు దొరికిందన్న
ఆనందం.

# మిస్ ఇండియా

మిస్ ఇండియాగా
గుర్తింపు పొందాలని
అంగాంగ ప్రదర్శన
అలవాటు చేసుకుంది
ఆబగా చూసే
చూపులకు కూడా
అలవాటుపడిపోయింది
ఆమె అందానికి
వెన్నతో మర్దనా చేస్తూ
మెరుగు దిద్దుతూ
తన శక్తిని ఆవిరిచేసుకుంటుంది
ఆ ఇంటిలోని పనిపిల్ల
ఒంటినిండా బట్ట కప్పలేని
పేదరికం దానిది
తరగనంత ఆస్తివున్నా
వంటినిండా
బట్టలేసుకోవడం మోటు
నేటి ఫ్యాషన్ ప్రపంచంలో
పేదరికంతో ఒకరు
నాగరికత పేరుతో మరొకరు
యవ్వనాన్ని బట్టబయలు
చేసుకుంటున్నారు.

# సూటిగా

అతడెప్పుడూ
నాకళ్ళల్లోకి సూటిగా చూసి
మాట్లాడడు
నిక్కచ్చీ
నిజాయితీ పెనవేసుకున్న
స్వచ్ఛమైన కళ్లతో
కళ్లు కలిపి మాట్లాడడానికి
ధైర్యం చాలకనో
ఆడదానితో
నిలబడి మాట్లాడట మేమిటనే
పురుషాహంకారమో
ఇంట్లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు
పరిష్కార బాధ్యత
తనమీద పడుతుందేమోనని
సమస్య పూర్వాపరాల నుంచి మొదలుపెట్టి
ప్రస్తుత పరిస్థితికి దారితీసిన
కారణాలను శోధించి
తప్పిదాలన్నింటికి నన్ను బాధ్యురాలిని చేసి
అనుభవించమంటూ శాపనార్థాలు పెట్టి
కొంపలు ముంచుకుపోయే
రాచకార్యమేదో తరుముకొస్తున్నట్టు
నా కళ్లను తప్పించుకుంటూ
విసావిసా ఇంటిలోంచి
నిష్క్రమిస్తాడు
అతడు మగాడు మరి!

# కళ్లలో ఒత్తులేసుకుని

'అమ్మా' అన్న పిలుపు విని
ఎంతకాలమయిందో
ఆ పిలుపు కోసం
ఒళ్లంతా చెవులు చేసుకుని
బ్రతుకుతున్నావురా నాన్నా
'అమ్మా' అని మొదటిసారి నీ పిలుపు
ఎదలో కోటి వీణలు మోగించి
నిను హత్తుకుని ముద్దాడిన దృశ్యం
నాకనులముందు ఇంకా నర్తిస్తూనే వుంది
గోరుముద్దలతో మాతృభూమిపై
ప్రేమను రంగరించి పెట్టాను
డాలరుపై ప్రేమ పెంచుకుని
నా గుండె చెరువుగా చేశావు
మసక వెలుతురులో నిను పోలుస్తానో లేదోనని
మసకబారిన కళ్లల్లో వత్తు లేసుకుని
నీరాక కోసం ఎదురుచూస్తున్నారా కన్నా
నా ఎడారి జీవితంలో పూలు పూయించేది
'అమ్మా' అన్న నీ పిలుపేరా!
"కన్నా కన్నా" అని పలవరిస్తూ
తడారిన నా పెదాలపై చిరుజల్లువై రారా నాన్నా
మోడు వారిన నా బతుకున
తొలికరివై పలకరించగా రారా కన్నా
నువ్వుఎంతో ఎత్తు కెదగాలనుకున్నా!
కానీ అమ్మకే అందనంత
ఎత్తుకెదిగావురా నాన్నా!

# ఆకసాన్ని మింగాలని

నదికెంత ఆత్రమో
సాగరంలో కలవాలని
లేగదూడకెంత ఆత్రమో
గుమ్మపాలు గ్రోలాలని
తుమ్మెదకెంత ఆత్రమో
పువ్వుపై వ్రాలాలని
కిరణానికెంత ఆత్రమో
కమలాన్ని తాకాలని
చంద్రునికెంత ఆత్రమో
కలువను పలుకరించాలని
అలల కెంత ఆత్రమో
తీరం చేరాలని
మనిషికెంత ఆత్రమో
ఆకసాన్ని మింగాలని.

*('విశ్వసాహితి' కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# అమెరికా ఎత్తుకెళ్లిన దీపావళి

"అమ్మా దీపావళి శుభాకాంక్షలు
టపాకాయలు కొన్నారా లేదా"?
మా బదులు కూడా మీరే కాల్చండి
'నెట్'లో చూస్తాం
అమెరికా నుంచి పిల్లలిద్దరూ
కాన్ఫరెన్స్ కాల్‌పెట్టి ఒకేసారి లైన్‌లోకి వచ్చారు
పండగరోజు మీ పలకరింపులే
మాకు నిజమైన దీపావళి
సంబరంతో గొంతు పూడుకుపోయింది
పిల్లలు మాట్లాడుతూనేవున్నారు
నామనసు గతంలోని మధురమైన
సంఘటనలను నెమరువేస్తోంది
చలికి ముడుచుకు పడుకున్న పిల్లల్ని
తెల్లారు ఝామునేలేపి
నేలటపాకాయలు కాల్పించి
నరకుడి పీడ విరగడయింది
మాడుకు నూనె పెట్టుకుని సంతోషంగా
తలంటు పోసుకోవాలి అంటూ
"చలేస్తోందమ్మా" అంటున్నా
బుజ్జగిస్తూ నలుగుపెట్టి తలంటేదాన్ని
ముందర రోజే వండిన పిండివంటలన్నీ
అటొచ్చీ ఇటొచ్చీ చిటుకూ చిటుకూ తింటూ
అన్నీ ఖాళీ చేసేవాళ్లు
సాయంత్రం కొత్త బట్టలు వేసి

లక్ష్మీదేవిని 108 కొత్త నాణాలతో పూజ చేయించేదాన్ని
నాణాలు నాకెక్కువ కావాలంటే
నాకెక్కువ కావాలంటూ పోటీపడేవారు
అందరికంటే మనింట్లో ఎక్కువ పెట్టాలని
ఇంటి చుట్టూతా దీపాలు పెట్టేవారు
లక్ష్మీ బాంబులన్నీ సుపుత్రుడు చేజిక్కించుకుని
చెల్లిలికి కాకరపువ్వత్తులిచ్చేవాడు
"నాకూ బాంబుకావాలన్నయ్యా" అంటూ గొడవచేసేది
ఆడపిల్లవి - బాంబులుకాల్చకూడదంటూ చెల్లివి
ఏడిపించేవాడు
"చూడమ్మా" అంటూ పేచీలు పెడుతూ
ఇద్దరూ నాచుట్టూ చుట్టూ తిరిగేవారు
పెద్ద చదువుల్లో కొచ్చేసరికి
అమెరికాలో చదువు కోవాలంటూ వెళ్ళి
అక్కడే ఉద్యోగాల్లో స్థిరపడ్డారు
అందుకే ఈ నెట్‌లో పలకరింపులు
పిల్లల్లేకుండా పిండివంటలు చేయిబుద్ధికాలేదు
పనివాళ్లకన్నా పెట్టాలి కదా అని
స్వగృహ నుండి స్వీట్లు తెప్పించాను
గూడు కట్టుకున్న నిర్వేదాన్ని ఛేదించడానికి
దీపావళి నాటి పిల్లల చిలిపి పోట్లాటలు
గుర్తుకు తెచ్చుకుని కాలక్షేపం చేస్తున్నాము
ఏమిటో ఈ దీపావళి సంబరాన్నంతా
అమెరికా ఎత్తుకెళ్లి పోయిందనిపిస్తోంది.

*('నేటి నిజం' లో ప్రచురితం)*

# అందాల ప్రకృతి

ఆకసమున పోడసూపిన
వెలుగుచుక్కలు
చుక్కల నడుమ
చక్కనైన
వెన్నెలరేడు
కలువ కొలనులో
కనువిందుచేస్తున్న
వెన్నెల వెలుగులు
నందనము నుండి
పరిమళము మోసుకొచ్చిన
మలయ పవనుడు
మదిహాయిని గొలిపే
అందాల ప్రకృతి
మనిషికి విధాత
ఒసగిన సుకృతి.

# మనసు వెంట

మనసు వెంట
పరుగిడితే
విషయవాసనల
వలయంలో
చిక్కుకుని
మళ్లీ మళ్లీ పుడుతూ
చస్తూవుంటాం
మనసుని మచ్చిక చేసి
విచారణతో శుద్ధి చేసి
తరించే మార్గం పట్టాలి
అప్పుడే
బహు దుర్లభమయిన
ఈ మానవ జన్మకు
సార్థకత.

# ఆమె పలవరింపు

అన్న వస్త్రాలకు లోటులేని
సుఖమయిన జీవితం
ఆధునిక సౌకర్యాలన్నీ వున్న
సౌకర్యవంతమైన జీవితం
అయినా
"అమ్మా తిన్నావా? మందులేసుకున్నావా? అని
ఆప్యాయంగా అడిగే తనయుడి
రెండు మాటల కోసం
సాయంత్ర మయింది మొదలు
వాకిలికి కళ్లు, చెవులు అప్పగించి
ఎదురు చూపులు
శక్తినంతా ఆఫీసులో ఆవిరిచేసి
రాత్రి పదిగంటలకి వుసూరుమంటూ
వచ్చిన కొడుకును చూసి
"పాపం" పిచ్చివెధవ అలసిపోయి వచ్చాడు
కాస్త ఎంగిలిపడి
విశ్రాంతి తీసుకోనీ" అనుకుంటూ
నిశబ్దంగా తన గదిలోకి నిష్క్రమించి
బరువెక్కిన హృదయాన్ని
నిట్టూర్పుతో ఓదార్చుకుంది
ఆమె హృదయం పరితపించేది
పంచభక్ష్యపరమాన్నాల కోసం కాదు
భౌతిక సుఖాల కోసం కాదు
ఆత్మీయత కోసం-ఆప్యాయత కోసం
ప్రేమగా పలకరించే మనిషి కోసం.

*(గూఢాచారి మాసపత్రికలో ప్రచురణ)*

# బాల్యమా! నీకు జోహార్లు

నదురూ బెదురూ చీకూ చింతా లేని
నిత్య చైతన్యం బాల్యం
ఇసుకలో కట్టిన పిచ్చుకగూళ్లు
వాన నీటిలో కాగితపు పడవలు
పుస్తకం మధ్యలో నెమలీక
కోయిలమ్మతో గొంతు కలిపి పాడటం
చందమామతో వేసుకున్న నడక పందెం
చిరుజల్లుల్లో "వానా వానా వల్లప్ప" ఆటలు
చొక్కా అంచుకు పప్పుబిళ్లపెట్టి కొరికి
కాకెంగిలంటూ పంచుకుతినడం
కళ్ళంబడి నీళ్లొస్తున్నా, రోస్తూ
ఉప్పు కారం అద్దిన మామిడి ముక్కలు తినడం
బొంబాయి మిఠాయితో పెట్టించుకున్న "వాచీ" "ఉంగరం"
తలపుకొస్తే చాలు మది గది ఆనందనిలయం
కొంగా కొంగా! నా గోళ్ళ మీద పువ్వేసి పొమ్మని పిలుపు
విమానానికి "టాటా" చెప్పి మురిసిన తలపు
తుమ్మెదకు దారం కట్టి ఎగరేసిన చిలిపి చేష్ట
తలపు కొస్తే ఎదలో గిలిగింతలు
బడి ఎగ్గొట్టానని మాస్టారు చెవి మెలివేయడం
మార్కులు బాగా రాలేదని నాన్న గోడ కుర్చీవేయించడం
తలుపు చాటునుంచి చూస్తున్న అమ్మ కళ్లు చెమ్మగిల్లడం
ఒకటా! రెండా! ఎన్నో! ఎన్నెన్నో మధుర స్మృతులు
నామది ఆల్బమ్‌లో పదిలం
నాటి ఆట పాటల వూసులే
నేటి నా వుత్సాహానికి ఊపిరులు
జీవితంలో మిగిలిన తీపిగురుతులు
అందుకే! బాల్యమా! నీకు జోహార్లు.

# ప్రథమ బహుమతి

కవితల పోటీకి
న్యాయనిర్ణేతగా
వ్యవహరించ మన్నారు
ఎంతమంది హృదయావిష్కరణలో
సమాజ దురాగతాలను ఎండగడుతూ
విభిన్న కోణాల్లో దృశ్యమానం
రైతు ఆత్మహత్యలు
ఉగ్రవాదం, స్త్రీవాదం, మతోన్మాదం
పాఠశాలల్లో కీచకులు
యాసిడ్ దాడులు, మానభంగాలు, భ్రూణ హత్యలు
పర్యావరణ కాలూష్యం, మానవత్వ కాలుష్యం
ఎన్నో ఎన్నో సమస్యలు, సమాధానాలు
సూచనలు, పరిష్కారాలు
కవుల స్పందనలకు ప్రతీకలుగా వున్నాయి
అన్నీ నగ్న సత్యాలే!
ఒక్కొక్కటి ఒక్కొక్క కోణంలో
హృదయాన్ని కదిలించేవిగా
నేటి సమాజానికి దర్పణంగా వున్నాయి
నేను నిర్ణయించాల్సినవి
ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులే!
కానీ
నా హృదయంలో
అందరి హృదయావిష్కరణలకూ
ప్రథమ బహుమతే!

*(చేతన మాస పత్రికలో ప్రచురితం)*

# నిస్తేజం

ఒకప్పుడు
రైతు ఆత్మహత్య చేసుకున్నాడని
స్త్రీలపై అత్యాచారం జరిగిందని
కిరసనాయిలు పోసి భార్యకు నిప్పంటించాడని
భ్రూణహత్యకు పాల్పడ్డారని
పిల్లల్ని కిడ్నాప్ చేశారని
వార్తలు చదవగానే
మనసు వికలమై,
విలవిల్లాడి, కన్నీరు ధారగా కారేది
"ఏమిటి అరాచకం
ఎక్కడికి పోతున్నాం మనం" అన్న
ఆలోచనలతో నిద్రపట్టక
ఆవేదనగా అశాంతిగా వుండేది
కానీ! అదేమిటో!
ఇప్పుడు ఏడుపురావడం లేదు
ఎందుకంటే
వార్తా పత్రికలు తెరవగానే
మొదటి నుంచి తుదివరకూ
అన్నీ అరాచకాల కథనాలే!
బాధ పడీ పడీ
గుండె బండబారిపోయింది
కళ్లు పొడారిపోయాయి
మస్తిష్కం నిస్తేజంగా మారింది
స్పందించటం మానేసింది.

*(సాహిత్య స్రవంతిలో ప్రచురితం)*

# నాన్న

వేలు పట్టి నడిపించే వేలుపు
ఓనమాలు దిద్దించిన తొలిగురువు
బాటచూపి నడవమనే వెలుగుదారి
తడబడితే ఊతమిచ్చే చేతికర్ర "నాన్న"
పైకి గాంభీర్యం ముసుగు
మనసునిండా ప్రేమ మధువు
శిఖరమంత వాత్సల్యానికి
చిరునామా "నాన్న"
నాన్నంటే ధైర్యం
నాన్నంటే అభయం
నాన్నంటే పెట్టని కోట
వ్యక్తిత్వ వికాసానికి బాట
సవ్యమైన నడత
భవితకు చేయూత
నేరపి "నాన్న"
నాన్న ఒక హితుడు
నాన్న ఒక మంచి స్నేహితుడు.

# అర్థం మార్చాల్సివస్తుందేమో!

ముక్కుపచ్చలారని ముద్దు గుమ్మను
విధవరాలని చేసి వంటింటికి
పరిమితం చేసింది నాటి కన్యాశుల్కం
మధురోహల నవ వధువుకు
కిరసనాయిలుతో మరణశాసనం
రాసింది నేటి వరకట్నం
కర్మకాండలు ముగిసిన
మరునాడే మరో మనువుకు సంసిద్ధం
మగడు కాలంచేస్తే రంకు అంటగట్టి
లొంగదీసుకునే సిగ్గు మాలినతనం
మూడు ముళ్ల కోసం ప్రాధేయపడితే
మోజు తీరిన దానితో పనేంటని
కాటికి పంపుతున్న కసాయితనం
కిలకిల నవ్వుల పడుచుదనాన్ని
మాటువేసి మానభంగం చేస్తున్న పైశాచికత్వం
కసుగాయలను సైతం
కన్నూమిన్నూగానని కామంతో
కబళిస్తున్న పాశవికత్వం
ఇవన్నీ పుట్టిన తరవాతి సంగుతులైతే
పుట్టకుండానే పొట్టలోనే
చిదిమేస్తున్న అనాగరిక అమానుషత్వం
వేలగొంతుల స్త్రీల ఆర్తనాదాలు
నరరూప రాక్షసుల
ఆగడాలకు ఆవిరైపోతున్నాయి
ఆదిశక్తిగా కొలిచే అతివను

అబలగా, బేలగా, అసహాయురాలిగాచేసి
వికటాట్టహాసం చేస్తున్న దుర్మదాధం
సీతను అపహరించిన రావణుడు
ద్రౌపదిని చెరబట్టిన కీచకుడు
వస్త్రాపహరణం కావించిన దుశ్శాసనుడు
శిశుహత్య చేయించిన కంసుడు
దుర్మార్గులుగా కనిపించడం లేదు నాకు
వేలకు వేలు రావణాసురులు
కీచకులు, దుశ్శాసనులు, కంసులు
విచ్చలవిడిగా, దుశ్చర్యలకు పాల్పడుతూ
పెద్దమనుషులుగా చలామణీఅవుతున్న
నేటి సమాజంలో
దుర్మార్గత్వానికీ, దుర్మదాంధానికీ
అర్థం మార్చాల్సి వస్తుందేమో!
దోషులను శిక్షించడానికి
ఏళ్లూ పూళ్లు పట్టే పుచ్చిపోయిన
న్యాయవ్యవస్థ ఇచ్చే తీర్పు తీర్పేకాదు
తీర్పు ఇవ్వడం ఆలస్యం మయితే
అన్యాయం చేసినట్టే లెక్క
మగువను మృగాల్లా వేటాడుతున్న
మానవ మృగాళ్లకు
దెబ్బకుదెబ్బ తీసే సత్వర
ఆటవికన్యాయమే సరైన శిక్ష
అప్పుడే చల్లారుతాయి అతివల గుండెల్లో
రగులుతున్న అగ్నిజ్వాలలు.

*(నిర్భయ పాశవికంగా మానభంగం చేయబడి మరణించిన సందర్భాంలో) (నేటి నిజంలో ప్రచురితం)*

# వెంకటాద్రి రైలు బండి

దృశ్యాలను వెనక్కి నెడుతూ
వాగులు దాటుతూ
వంకర్లుపోతూ
వంతెన లెక్కి దిగుతూ
సొరంగాల గుండా
చీకటిని చీల్చుకుంటూ
పక్కచూపులు చూడకుండా
నమ్మకున్నవారిని
గమ్యం చేర్చడమే లక్ష్యంగా
ధీరోదాత్తునిలా
పరుగులు పెడుతోంది "వెంకటాద్రి"
ఆశలనూ ఆనందాలనూ
ఆప్యాయతలనూ అనుభూతులనూ
సుఖాలనూ దుఃఖాలనూ
తనవెంట మోసుకెళ్తోంది వెంకటాద్రి
పచ్చని పంట పొలాలు
చక్కని పంచ కట్టులు
అచ్చ తెలుగుదనంతో అలరారే 'కడప' కు
చేర్చడానికి పరుగులిడుతోంది వెంకటాద్రి
కవితా సాహితీ సాంస్కృతిక సంబరాలు
తిలకించడానికి కడపవాసుల స్నేహ సౌరభాలు
ఆస్వాదించడానికి
"చుక్‌చుక్" ధ్వనితో
లయబద్ధమైన

పట్టాల పదనర్తనాలతో
వడివడిగా పరుగులిడుతోంది వెంకటాద్రి
ప్రముఖ నటులు, రచయిత రంగనాథ్‌గారు
'నేటి నిజం' సంపాదకులు బైస దేవదాస్‌గారు
'సాహితీ కిరణం' సంపాదకులు
పొత్తూరి సుబ్బారావుగారు
వర్ధమాన కవి
ముసునూరి రామ్‌కుమార్
చార్టర్డ్ ఇంజనీరు, మా శ్రీవారు
కేతవరపు మాధవరావుగార్లతో
ఊసులు చెప్పుకుంటూ
అనుభూతులను పంచుకుంటూ
'వెంకటాద్రి'లో నా ప్రయాణం
అత్యంత ఆత్మీయం
మరువలేని, మరువరాని మధురఘట్టం
ఈ పయనం
ఆనందాల అస్వాదన
ఆత్మీయతల పందిరి
అందుకే
నామది ఓలలాడుతోంది
ఆనంద నందనాన.

*(నేటి నిజంలో ప్రచురితం) (సంస్కృతీ సంప్రదాయల సంబరాలకు కడపకు వెంకటాద్రిలో ప్రయాణం సందర్భంగా రైలులో కవిసమ్మేళనం బైస దేవదాసుగారు నిర్వహించిన సందర్భంగా)*

# మా అల్లుడు బంగారం

ప్రతాప వంశమున పుట్టి
ప్రియాంకను అర్థాంగిగ చేపట్టిన
అర్ధనారీశ్వరుడు
మాకల్లుడైనట్టి శ్రీరామ శ్రీకాంత్
గంభీరమైన కంఠం
పసితనపు చిలిపితనం
దైవభక్తి కడుమెండు
క్రికెట్టు ఆటలో బెస్టు
అధునాతన దేశంలోవున్నా
సదాచారం పాటించడంలో మిన్న

ఆఫీసు పనిలో ఫస్ట్
ఇంటిపనిలో చేదోడువాదోడు
శుచిశుభ్రతలకు పెట్టింది పేరు
నిర్మలత్వం అతడికి మారు పేరు

పెద్దరికానికి గౌరవం
చిన్నతరానికి వాత్సల్యం
యువతరానికి నేస్తం
సహచరికి ప్రేమామృతం

ఆత్మీయంగా పలకరించే తత్వం
నలుగురినీ కలుపుకుపోయే మనస్తత్వం
పాలలో తేనెలా కలిసిపోయేతత్వం
మానవతకు ప్రేమను జోడించే మనస్తత్వం

ఆరడుగుల ఆజానుబాహుడు
పిలిస్తే పలికే ఆపద్భాంధవుడు
తరతమ బేధంలేని మంచివాడు
అందరి మన్ననలు పొందిన
అందరివాడు
వెరసి ప్రియాంక వల్లభుడు
శ్రీకాంత్
అందుకే నేనంటాను
మా అల్లుడు బంగారం అని.

*(తానా సభలకు అమెరికా వెళ్ళి, న్యూజెర్సీలో వున్న అమ్మాయి అల్లుడు దగ్గర వున్నప్పుడు స్పందించి రాసిన కవిత).*

# అక్కున చేర్చుకుందాం

విరిసీ విరియని సొగసు
తెలిసీ తెలియని వయసు
ఎదలో ఏదో తుళ్లింత
మనసులో పెడుతున్న గిలిగింత
ఏమిటీ వింత?

అమ్మతో చెప్పాలంటే బిడియం
నాన్నను చూస్తే భయం
పంచుకునే స్నేహం కోసం ఆరాటం
ఆపోజిట్ సెక్స్ పట్ల ఆకర్షణ
అమ్మనాన్నలు మందలించారన్న వుక్రోషం

తన కాళ్ళమీద తాను నిలబడి
తనేంటో నిరూపించుకోవాలన్న ఆవేశం
ఇంటి నుంచి
కాలుబయట పెట్టించింది
రాబందుల వలలో చిక్కి
వారి ఆకలికి ఎరగా మారింది
డేగకాళ్ల కింద పక్షిలా
గిలగిల లాడింది
తప్పించుకునేందుకు మార్గం లేదు
బండ బారింది మనసు
యాంత్రికమైంది శరీరం
క్షణికమైన ఆవేశం ప్రభంజనమై
బ్రతుకును ఛిద్రం చేసింది

ఎంతమందినో ఆదరించిన శరీరం
సునామీ కన్నా ఘోరమైన
"హెచ్.ఐ.వి." ని కూడ ఆదరించిందని
వైద్యులు చెప్పినప్పుడు
అంటే ఏమిటని
అడిగింది అమాయకంగా
మనుషులకి మాత్రమే సోకే
ప్రాణాంతక వ్యాధనీ
ఒకసారివస్తే
మరణంతోనే స్వస్థి అని తెలుసుకుని
నిర్ఘాంతపోయింది
ఒక్క తప్పటడుగుకి
ఇంత పెద్ద శిక్షా?
వెక్కి వెక్కి ఏడ్చింది
'ఛీ' అన్నారు వైద్యులు
'ఛీ' అన్నారు అమ్మనాన్నలు
ఎక్కడికి పోవాలో తెలియదు
ఇదేనా ఈ సమస్యకు పరిష్కారం
ఎక్కడుంది లోపం
ఎవరిది ఈ పాపం
లైంగికాంశాల పట్ల అవగాహనారాహిత్యం
కౌమారంలోకి అడుగిడుతున్నప్పుడు
శారీరక మార్పుల సందేహాల నివృత్తికి
అనువైన వాతావరణం
ఇంట్లో లేకపోవడం
భావోద్వేగాలను పంచుకోవడానికి

తోడు కోసం ఆరాటంతో
బయటి ఆకర్షణల వలయంలో చిక్కి
హెచ్.ఐ.వి బారిన పడుతోంది
విరసీ విరియని యవ్వనం
ఏమిటి మన కర్తవ్యం
యువత భవితను
కాపాడవలసిన బాధ్యత అందరిదీ కాదా!
ఇది అంటువ్యాధికాదని
మనుషుల మనసుల కంటుకున్న జాడ్యమని
హెచ్.ఐ.వి. పాజిటివ్ సోకినవారు
అంటరానివారు కారని తెలుసుకుందాం
మనతో కలిసిమెలిసి తిరగనిద్దాం
వారిలో ధైర్యం నూరిపోద్దాం
అనునయిద్దాం ఆదరిద్దాం
అక్కున చేర్చుకుందాం.

*(ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోలు బోర్డువారు నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సదస్సుకు స్పందించి రాసిన కవిత)*

# మహాభి నిష్క్రమణం

'అ' అవిశ్రాంత నటుడు
'క్కి' కిరీటంలేని రేడు
'నే' నేటి నటులకు మార్గదర్శకుడు
'ని' నిరంతర అన్వేషకుడు
వెరసి నా అభిమాన నటుడు
నటనకే భాష్యం చెప్పిన
నటసామ్రాట్ అక్కినేని
నా "గుండె చప్పుళ్లు" పుస్తకం
అక్కినేనికి అంకితమిచ్చినప్పుడు
"నీ కవితా పుత్రికను స్వీకరించి
నీకు నేను అల్లుడినయ్యాను
నువ్వు నాకు అత్తగారివి"
అన్న చమత్కారి

"ఊహల వసంతం" పుస్తకాన్ని
ఆవిష్కరించి
నాకు గౌరవాన్ని ఆపాదించిన
మహోన్నతుడు

నా పుత్రిక ప్రియాంక
వివాహానికి విచ్చేసి
ఆశీస్సులందించి అంబరమంత
ఆనందాన్నిచ్చిన నిరాడంబరి

ఫోన్ చేయగానే
నా గొంతు గుర్తుపట్టి
ఎలావున్నారత్తగారని పలకరించే
నిగర్వి
చెదరని చిరునవ్వు ముఖారవిందం
స్ఫూర్తిమంతమైన నిత్యచైతన్యం
మూడు తరాలను మురిపించిన
మేరునగ ధీరుడు
మిత నియత ఆహారం
ప్రణాళికా బద్ధ జీవితం
ఎగిరిపడని మనస్తత్వం
నిండుకుండ వారి వ్యక్తిత్వం

బిరుదులు, అవార్డులకన్నా
ప్రేక్షక దేవుళ్లే మిన్న
అని నరుడిలో నారాయణుడిని చూసిన
ఆధ్యాత్మికుడు
చికిత్సానంతరం తిరిగివస్తానని
శత వసంతాలుంటానని మాటిచ్చి
తిరిగిరాని లోకాలకు
నిశ్శబ్దంగా నిష్క్రమించాడు

కుటుంబమంతా కలిసి
అక్కినేని మహాభినిష్క్రమణకు
పలికిన కన్నీటి వీడ్కోలు
అంతరించిపోతున్న
మానవీయ విలువలకు
కనువిప్పు

కోట్ల అభిమానుల
హృదయాల్లో చిచ్చుపెట్టిన
బహుదూరపు బాటసారి
జనుల గుండెల్లో చిరంజీవి

నీకు నివాళులర్పిద్దామంటే
గళం మూగగా రోదిస్తోంది
కలం ముందుకు సాగనంటోంది
అశ్రువులు కళ్లను మసకబార్చాయి
ఓ ధృవతారా!
నీ మహాభినిష్క్రమణకి
ఇవే నా జోహార్లు.

*(నేటి నిజంలో ప్రచురితం)*

# अखिल भारतीय भाषा साहित्य सम्मेलन

केन्द्रीय कार्यालय - ४३, ग्रीन एवेन्यू, कोलार रोड, भोपाल (म.प्र.)

सत्यम् शिवम् सुन्दरम्

## उपाधि प्रमाण-पत्र

# भारत भाषा भूषण

## श्रीमती केतावरापू राजश्री

राष्ट्र के भावात्मक नवोत्थान की इन मंगल-घड़ियों में भाषाओं
की सृजनात्मक भूमिका अनिवार्य है।
आपकी भाषा-साहित्य सेवा के उपलक्ष्य में
अखिल भारतीय भाषा साहित्य सम्मेलन आपको अपनी सर्वोच्च उपाधि
भारत भाषा-भूषण से अलंकृत कर स्वतः को गौरवान्वित अनुभव करता है।
सम्मेलन की शुभेच्छा है कि आपके द्वारा भारतीय भाषा साहित्य का यह
अक्षय-कोष निरन्तर अपनी श्रीवृद्धि करता रहे।

डॉ. यास्मीन सुल्ताना नकवी
राष्ट्रीय महासचिव

सतीश चतुर्वेदी
राष्ट्रीय अध्यक्ष

# Akhil Bhartiya Bhasha Sahitya Sammelan

Central Office : 43, Green Avenue, Kolar Road, Bhopal-16

Satyam Shivam Sundaram

## Certificate of Title

# BHARAT BHASHA BHUSHAN

## Smt. Ketavarapu Rajshree

is conferred with Supreme Title of Bharat Bhasha Bhushan
for the Creative services rendered by her
to enrich the emotional integration of the country
in the field of Indian Languages and Literature.
We wish her to continue the auspicious contribution to
Indian Languages and Literature.

Dr. Yasmeen Sultana Naqvi
Secretary General

Bhopal, 1 December 2013

Satish Chaturvedi
President



# రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీకి సత్కారం

సాక్షి

## బహుముఖ ప్రజ్ఞాశాలి కేతవరపు : డాక్టర్ తిరునగరి



రచయిత్రి రాజ్యశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

వివేక్‌నగర్, న్యూస్‌లైన్: వర్తమాన సాహిత్యంలో తనదైన శైలిలో రచనలు చేస్తూ, రచయిత్రిగా, కవయిత్రిగా, ఆధ్యాత్మిక వ్యాఖ్యాతగా, వక్తగా తన ప్రతిభను బహుముఖంగా విస్తరింపచేసుకున్న రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ అభినందనీయురాలని ప్రముఖ కవి డాక్టర్ తిరునగరి ప్రస్తుతించారు. రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీకి భారత భాషాభూషణ్ బిరుదు వచ్చిన సందర్భంగా శనివారం ఉదయం కళా సుబ్బారావు కళావేదికలో అభినందన సాంస్కృతిక సంస్థ ఏర్పాటుచేసిన అభినందన ఆత్మీయ సత్కార సభకు అధ్యక్షత వహించి ప్రసంగించారు. భారత భాషాభూషణ్ జాతీయ స్థాయిలో సాహిత్యంలో కృషి చేసిన వారికి లభించే గొప్ప గుర్తింపని వివరించారు. ఈ సందర్భంగా రచయిత్రి రాజ్యశ్రీని నిర్వాహక సంస్థ పక్షాన అతిథులు ఘనంగా సత్కరించారు. పలు సాంస్కృతిక సంస్థలు, రచయితలు, కవులు రాజ్యశ్రీని సత్కరించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య మసన చెన్నప్ప సభలో పాల్గొన్న సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, డాక్టర్ పి.ఎస్.మూర్తి, డాక్టర్ డి.మధుసూదన్, రచయిత తంగిరాల చక్రవర్తి, కళాదీక్షితులు, అభినందన భవాని కవి మౌనశ్రీ మల్లిక్, మోహన సత్య, శోభాపేరిందేవి రచయిత్రి రాజ్యశ్రీ సభలో పాల్గొని ప్రసంగించారు.

# సాహిత్యంలో అనేక ప్రక్రియలను చేపట్టిన రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ



డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీని సత్కరిస్తున్న ఆచార్య మసన చెన్నప్ప తదితరులు

**చిక్కడపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త:** సాహిత్యంలో అనేక ప్రక్రియలను చేపట్టి అందరి నుంచి ప్రశంసలు అందుకున్న గొప్ప రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ అని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్యకళాశాల విభాగం అధిపతి ఆచార్య మసన చెన్నప్ప అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో అభినందన సాహిత్య సాంస్కృతిక సంస్థ, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల అఖిలభారత భాషా భూషణ్ బిరుదును అందుకున్న ప్రముఖ రచయిత్రి డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, కవితిలక తిరునగరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మసన చెన్నప్ప మాట్లాడుతూ, సాహిత్యంలో రెక్కలు, నానీలు, వ్యాసాలతో పాటు అన్ని ప్రక్రియలను రచనలు చేసిన ఘనత రాజ్యశ్రీ చేపట్టారన్నారు. ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియలను చేపట్టారన్నారు. ఇటు రచనలతోపాటు ఆధ్యాత్మికంగా కూడా రచనలు సాగించడంతో అందులో రాణించారన్నారు. రచయిత్రి రాజ్యశ్రీ పది పుస్తకాలు ఎంతో గొప్పగా రచించారని, ఈ విధంగా రచనలు చేయడం మూలంగా జాతీయ స్థాయిలో భారతభాషా భూషణ్ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో నిర్మాణాత్మక రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా సాహితీకిరణ్ ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు, శిశువైద్య నిపుణులు డాక్టర్ పి.ఎస్.మూర్తి, డాక్టర్ డి.మధుసూదనరావు, ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు, ప్రపంచ రికార్డుల్లో గీత డాక్టర్ కళావెంకట దీక్షితులు, తంగిరాల చక్రవర్తి, రెక్కల రూపకర్త సుగమ్ బాబు, పెద్దూరి వెంకటదాస్, మౌనశ్రీ మల్లిక్, సాహిత్య ప్రకాశ్, మంగళ, అరుణకుమారి, మద్దాలి విజయలక్ష్మి, ఎం.రఘుపతి, నిర్వాహక సంస్థ కార్యదర్శి డాక్టర్ ఇ.భవాని, శోభాపేరిందేవి తదితరులు పాల్గొన్నారు.

వార్త

శనివారం 10, ఆగస్టు 2013 — ఈనాడు

# సాహితీవేత్త రాజ్యశ్రీకి ఘన సన్మానం



రాజ్యశ్రీని సన్మానిస్తున్న దృశ్యం..

త్యాగరాయగానసభ: అమెరికాలో జరిగిన తానా సభల్లో పాల్గొని వచ్చిన ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని శుక్రవారం అశోక్‌నగర్ వెల్ఫేర్, కల్చరల్ సెంటర్ లైబ్రరీలో కమలాకర లలిత భారతి కళాభారతి సంస్థవారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంశీ సంస్థల అధినేత డా. వంశీ రామరాజు మాట్లాడుతూ రాజ్యశ్రీ రచనలు సమాజాన్ని మంచి మార్గంలో పయనింపచేస్తాయన్నారు. సమస్యను ఎత్తిచూపడంతోపాటు దానికి పరిష్కారాన్ని కూడా చూపి సమాజాన్ని మంచిమార్గంలో నడిపిస్తున్నారన్నారు. జీవీఆర్ ఆరాధన సంస్థ అధినేత వెంకటరెడ్డి, పాత్రికేయుడు బైన దేవదాసు, సాహితీవేత్తలు డా తిరునగరి, సుబ్బారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2 శనివారం 23 మార్చి 2013

# ఆధ్యాత్మికతకు నిలయం భారతదేశం

## ఆధ్యాత్మికత వృద్ధులకేనా?
## గ్రంథావిష్కరణలో కె.వి రమణాచారి



రాజ్యశ్రీని సత్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

వివేకనగర్, మార్చి 22: (ఆంధ్రప్రభ) : ఆధ్యాత్మిక సంపదకు నిలయం మన భారతదేశమని, జగద్గురువులు ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు జన్మించిన పవిత్రభూమి మనది అని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి పేర్కొన్నారు. వంశీ విజ్ఞాన పీఠం, రాజమహేంద్రి భారతీ, శ్రీత్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి కళా సుబ్బారావు కళా వేదికలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ రచించిన 'ఆధ్యాత్మికత వృద్ధులకేనా?' వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రమణాచారి 'ఆధ్యాత్మికత వృద్ధులకేనా?' వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద, అరవిందుడు వంటి ఎందరెందరో మహనీయులు భారతదేశ ఆధ్యాత్మిక గొప్పతనం గురించి ప్రపంచ దేశాలకు తమ సందేశాల ద్వారా చాటిచెప్పారని అన్నారు. నేటి సమాజానికి ఉపయోగపడే విధంగా రచయిత్రి రాజ్యశ్రీ సుమారు 18 ఆధ్యాత్మిక పరమైన వ్యాసాలు రాశారని, ఈ వ్యాసాలన్నీ మనల్ని ఆలోచింపజేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సంపుటిలోని ప్రతి వ్యాసం పిల్లలకు పనికి వస్తుందని డాక్టర్ రమణాచారి అన్నారు. బాల్యం నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించాలని, అప్పుడే వారికి జీవితం విలువలు తెలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సభా ప్రారంభకులుగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పోతుకూచి సాంబశివరావు మాట్లాడుతూ రామాయణం, మార్గ సమస్యారాల విశిష్టత గురించి రాజ్యశ్రీ చక్కటి వ్యాసాలు రాశారని అన్నారు. నేటి సమాజానికి ఉపయోగపడే అంశాలను తీసుకొని రాజ్యశ్రీ పలు ఆధ్యాత్మిక పరమైన వ్యాసాలు రాశారని ఆయన పేర్కొన్నారు. సామాన్యులకు, మాన్యులకు కూడా ఈ పుస్తకంలోని వ్యాసాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని డాక్టర్ పోతుకూచి అభిప్రాయపడ్డారు. నైతిక విలువలు, చక్కటి సందేశాలు పలు వ్యాసాల్లో మనకు కనిపిస్తాయని ఆయన అన్నారు. పురాతన తెలుగు సాహిత్య ధర్మలక్షణాలు [illegible] రచయిత్రి రాజ్యశ్రీ అని డాక్టర్ పోతుకూచి పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, [illegible] నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు, డాక్టర్ పి.ఎస్.మూర్తి [illegible] పలు రచనల ద్వారా చక్కటి సేవలు అందిస్తున్న రచయిత్రి రాజ్యశ్రీని కొనియాడుతూ మాట్లాడారు. రచయిత్రి డాక్టర్ కె.బి.లక్ష్మి పుస్తక సమీక్ష చేశారు. ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవవలసిన పుస్తకమని ఆమె అన్నారు. రచయిత్రి రాజ్యశ్రీ స్పందన ప్రసంగం చేశారు. శిరోమణి వంశీ రామరాజు, డాక్టర్ [illegible] సుధాదేవి, కె.భద్రారావు [illegible] సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వివిధ సంస్థల పక్షాన రచయిత్రి రాజ్యశ్రీని అతిథులు సత్కరించారు. కె.మాధవరావు, పొత్తూరి సుబ్బారావు, గుదిబండి వెంకటరెడ్డి, తంగిరాల చక్రవర్తి, టి.వెంకట్రామయ్య [illegible] సభలో సత్కారాలు అందుకున్నారు. సభకు ముందు జరిగిన భక్తి రస నృత్యాంశం అందరినీ అలరించింది.



రాజ్యశ్రీకి పురస్కారం అందజేస్తున్న అతిథులు

# బహుముఖ ప్రజ్ఞాశాలి రాజ్యశ్రీ

వివేకనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నతాధికారిగా ఉత్తమ సేవలందించి మన్ననలు పొందిన కేతవరపు రాజ్యశ్రీ, సాహిత్య రంగంలో కూడా ప్రసిద్ధి పొందడం అభినందనీయమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు మసన చెన్నప్ప ప్రశంసించారు. అభినందన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ సౌజన్యంతో శనివారం కళాసుబ్బారావు కళావేదిక ప్రాంగణంలో రాజ్యశ్రీకి ఆత్మీయ సత్కారం చేశారు. అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ నుంచి ప్రతిష్ఠాత్మక భారత్ భాషా భూషణ్ బిరుదు పొందిన సందర్భంగా రాజ్యశ్రీకి అభినందన సత్కారం జరిపారు. ప్రముఖ కవి, రచయిత తిరునగరి అధ్యక్షోపన్యాసం చేస్తూ అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ విశేషతను వివరించారు. పొత్తూరి సుబ్బారావు, పీఎస్ మూర్తి, మధుసూదన్, తంగిరాల చక్రవర్తి, కళాదీక్షితులు, సినీ గేయ రచయిత మౌనశ్రీ హాజరయ్యారు. ఆయా సాహిత్య సాంస్కృతిక, సమాజ సేవ సంస్థల ప్రతినిధులు రాజ్యశ్రీని సత్కరించారు.

శనివారం 10, ఆగస్టు 2013 సాక్షి

# రాజ్యశ్రీ రచనలు సమాజానికి ప్రతిబింబం

వివేక్‌నగర్, న్యూస్‌లైన్ : రచయిత్రి, కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ రచనలు సమాజానికి ప్రతిబింబం అని వక్తలు అన్నారు. కమలాకర లలిత కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ లైబ్రరీ హాల్లో జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని సంస్థ పక్షాన సత్కరించారు. సభలో ప్రముఖ కవి తిరునగరి, పత్రికా సంపాదకులు బైసా దేవదాసు, వంశీ రామరాజు, గుదిబండి వెంకట రెడ్డి, పొత్తూరి సుబ్బారావు, భారతీ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యశ్రీ రచనలకు ప్రశంసలు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: కేతవరపు రాజ్యశ్రీ సామాజిక స్పృహ, భావుకతలతో పాటుగా రచనానైపుణ్యం కలిగిన ఉత్తమ కవయిత్రి, కథకురాలు, వ్యాసకర్త, సంస్థానిర్వాహణ దక్షురాలని వక్తలు ప్రశంసించారు. శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో త్యాగరాయగానసభ సౌజన్యంతో మంగళవారం కళాసుబ్బారావు కళావేదిక ప్రాంగణంలో రాజ్యశ్రీ రచనలపై నిర్వహించిన సమాలోచన సమావేశంలో వారు అతిథి ప్రసంగాలు చేశారు. సాహితీకిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షోపన్యాసం చేస్తూ రాజ్యశ్రీ నానీలు, రెక్కలు, వ్యంజకాలు తదితర వచనాకవితా ప్రక్రియల్లో ప్రభావోపేత రచనలు చేశారన్నారు. ప్రత్యేక అతిథి డా. పోతుకూచి సాంబశివరావు మాట్లాడుతూ కవులు, రచయితలైన సచివాలయ ఉద్యోగుల సాహిత్యకృషిని ప్రోత్సహించడానికి రాజ్యశ్రీ వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారన్నారు. గౌరవాతిథి నిలోఫర్ ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డా. పీఎస్ మూర్తి ప్రసంగిస్తూ రాజ్యశ్రీ తన రచనల్లో నవరసాలు పండించారన్నారు. ఆమె పేరడీలతో సహా చదివించే కవితలు రాశారన్నారు. నేటి నిజం



రాజ్యశ్రీని సన్మానిస్తున్న సాంబశివరావు తదితరులు

సంపాదకుడు బైసా దేవదాసు, రచయిత్రి, కవయిత్రి శైలజామిత్ర, కవి, సినీగేయరచయిత మౌనశ్రీమల్లిక్, అతిథులుగా హాజరయ్యారు. నిర్వాహణ సంస్థ అధ్యక్షుడు లంకా వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శి భాను, గాయని వల్లీనాయకి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో రాజ్యశ్రీని కవితాశ్రీ బిరుదుతో ఘనంగా సత్కరించారు.

శుక్రవారం, 22 మార్చి 2013 హైదరాబాద్ నమస్తే తెలంగాణ 11



## 'ఆధ్యాత్మికత-వృద్ధులకేనా?' వ్యాససంకలనం ఆవిష్కరణ

త్యాగరాయగానసభ, మార్చి 21(టీ మీడియా) : భిన్నత్వంలో ఏకత్వంలా భారతీయులను కలుపుతున్న అంతర్లీన శక్తి 'ఆధ్యాత్మికత' అని రాష్ట్ర సాంస్కృతిక శాఖ ముఖ్య సలహాదారుడు డాక్టర్.కె.వి.రమణాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో వంశీవిజ్ఞానపీఠం నిర్వాహకులు వంశీరామరాజు, తెన్నేటి సుధాదేవి, కె.దర్భారావు ఆధ్వర్యంలో గురువారం కేతవరపు రాజ్యశ్రీ రచించిన 'ఆధ్యాత్మికత-వృద్ధులకేనా?' వ్యాస సంకలనంను డాక్టర్.కేవీ రమణాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి రాజ్యశ్రీని వంశీ సంస్థ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఆధ్యాత్మిక కవి సమ్మేళనం నిర్వహించారు. పలువురు సాంస్కృతిక సంస్థల అధినేతలు తంగిరాల చక్రవర్తి, గుదిబండి వెంకటరెడ్డి, పి.రాజేంద్రప్రసాద్, భారతి కమలాకర్, లంక సుబ్రహ్మణ్యంలను సత్కరించారు. పత్రికా సంపాదకులు వెంకట్రామయ్య, పొత్తూరి సుబ్బారావు, మాల్యాద్రి, రమణమ్మ లను సంస్థ సన్మానించింది. కార్యక్రమంలో కవులు రఘువీరప్రతాప్, కృష్ణమూర్తి, డాక్టర్.దత్తాత్రేయశర్మ, మౌనశ్రీమల్లిక్, సాహిత్యప్రకాశ్, వెంకటదాసు, మాధవి, శోభాదేవి, డాక్టర్.పోతుకూచిసాంబశివరావు, సుదామ, బైసదేవదాసు, డాక్టర్.పీఎస్ మూర్తి, డాక్టర్.కేబీ లక్ష్మీ పాల్గొన్నారు.

సాక్షి | హైదరాబాద్ | శుక్రవారం | మార్చి | 22 | 2013

# భారతీయతలో అంతర్లీనంగా ఆధ్యాత్మికత



రచయిత్రి రాజ్యశ్రీని సత్కరిస్తున్న రమణాచారి

వివేక్‌నగర్, న్యూస్‌లైన్ : భారతదేశం పూజా గృహం లాంటిదని మతాలు, భాషలు ఎన్నున్నా భారతీయులందర్నీ కలిపి ఉంచేది ఆధ్యాత్మికతేనని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. వంశీ విజ్ఞాన పీఠం, రాజ్‌కమల్ చారిటీస్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కళాసుబ్బారావు కళావేదికలో కేతవరపు రాజ్యశ్రీ రచించిన ఆధ్యాత్మికత -వృద్ధులకేనా వ్యాస సంపుటి ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. భారతీయతలో అంతర్లీనంగా ఆధ్యాత్మికత ఉందని అన్నారు. సభలో పాల్గొన్న సాహితీ వేత్త డా.పోతుకూచి సాంబశివరావు మాట్లాడుతూ రచయిత్రి రాజ్యశ్రీ రామాయణ విశిష్టత, ద్రౌపది సహనం, సూర్యనమస్కారాల విశిష్టత లాంటి అంశాలు వ్యాసాలుగా అందించారన్నారు. సభకు కవి సుధామ అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న రచయిత్రి కేవీ లక్ష్మి పుస్తకాన్ని సమీక్షించగా సభలో బైసా దేవదాసు, రచయిత్రి రాజ్యశ్రీ, పీవీఎస్ మూర్తి, డా.తెన్నేటి సుధాదేవి, వంశీరామరాజు, కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం, 29 డిసెంబర్ 2013 | ఆంధ్రప్రభ

# సాహితీవేత్త కేతవరపు రాజ్యశ్రీకి ఆత్మీయసత్కారం



రాజ్యశ్రీని సత్కరిస్తున్న అతిథులు

వివేకనగర్, డిసెంబర్ 28 (ఆఎన్ఎస్)

ఆధ్యాత్మిక రంగానికి కేతవరపు రాజ్యశ్రీ ఎనలేని సేవలు అందిస్తున్నారని, ఆమె రాసిన పలు ఆధ్యాత్మిక రచనలు ప్రజాదరణ పొందాయని, పలు ధార్మిక సభలైన సభల్లో ఆమె ఇచ్చిన ప్రవచనాలు ఎందరినో ప్రభావితం చేశాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య మాసన చెన్నప్ప అన్నారు. అభినందన సాంస్కృతిక సంస్థ, శ్రీత్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం కళాసుబ్బారావు కళా వేదికలో ఇటీవల భారత భాషాభూషణ్ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం స్వీకరించిన ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, వక్త కేతవరపు రాజ్యశ్రీకి అభినందన ఆత్మీయ పురస్కార సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య చెన్నప్ప మాట్లాడుతూ తన చుట్టూ ఉన్న సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసిన రాజ్యశ్రీ వందల సంఖ్యలో కవితలు రాశారని, ఆమె కవితలు మనల్ని ఆలోచింప జేస్తాయని అన్నారు. ఎందరో పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్న రాజ్యశ్రీ పలు ధార్మిక సభల్లో రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పలు కావ్యాలపై అనర్గళంగా ధార్మిక ప్రసంగాలు చేశారని, ఇప్పటికీ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తెలుగు భాషా సాహిత్యానికి రాజ్యశ్రీ చేస్తున్న సేవలకు గుర్తింపుగా భారత భాషాభూషణ్ బిరుదు రావడం చాలా సముచితంగా ఉందని ఆచార్య చెన్నప్ప అన్నారు. సభకు అధ్యక్షత వహించిన భారత భాషాభూషణ్, కవి తిలక డాక్టర్ తిరునగరి మాట్లాడుతూ నిగర్వి, వినయ సంపన్నురాలు అయిన రాజ్యశ్రీ రాసిన కవిత్వంలో మానవీయ దృక్పథం ఉట్టిపడుతుందని అన్నారు. తన చుట్టూ ఉన్న సమాజంలోని అసమానతలు, దోపిడీలను, అరాచకాలను [illegible] చాలా నిర్భయంగా రాజ్యశ్రీ రచనలు చేస్తున్నారని అన్నారు. మనసుల మనసులను చదివిన రాజ్యశ్రీ రచనలు మనల్ని ఆలోచింపజేస్తాయని ఆయన పేర్కొన్నారు. సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ మానవత్వానికి మారుపేరు రాజ్యశ్రీ అని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసమే ఆమె రచనలు చేస్తున్నారని, ఆమె రచనల్లో ఆర్ద్రత, నిబద్ధత, ఆవేశం కనిపిస్తాయని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ పీవీఎస్ మూర్తి, డాక్టర్ డి.మధుసూదన్, తంగిరాల చక్రవర్తి, ప్రపంచ రికార్డుల గ్రహీత డాక్టర్ కళా వెంకట దీక్షితులు వీరంతా మాట్లాడుతూ రాజ్యశ్రీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆమె తెలుగుసాహిత్యరంగంలో చేయని సాహితీ ప్రక్రియ లేదని అన్నారు. సమాజాన్ని ముఖ్యంగా మహిళలను చైతన్యవంతం చేసే రచనలు ఆమె కలం నుండి మరిన్ని జాలువారాలని వారంతా ఆకాంక్షించారు. నిర్వాహక సంస్థ పక్షాన భారత భాషాభూషణ్ బిరుదు పొందిన కవయిత్రి, వక్త కేతవరపు రాజ్యశ్రీని ఎందరో పాల్గొన్న అతిథులు శాలువ కప్పి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీత రాజ్యశ్రీ స్పందన ప్రసంగం చేశారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ ఒ.భవాని, శోభా పేరిందేవి వీరంతా సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పలు సాహితీ ప్రముఖులు సుగమబాబు, పెద్దూరి వెంకటదాసు, సాహిత్య ప్రకాష్, చిమ్మపూడి శివశంకర్, అంబటి నగరాలకు చెందిన పలు సాహితీ సంస్థల నిర్వాహకులు రాజ్యశ్రీని సత్కరించారు.

ఈనాడు హైదరాబాద్

# ఆధ్యాత్మికత అందరికీ అవసరం



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో డా. రమణాచారి తదితరులు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: భిన్నభావాలు, ప్రాంతాల మనుషులను సంఘీభావంతో కలిసిమెలిసి జీవింపజేసే మహత్తరశక్తి ఆధ్యాత్మికతకు ఉందని రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. వంశీ విజ్ఞానపీఠం, రాజ్‌కమల్ చారిటీస్ త్యాగరాయగానసభల సంయుక్తాధ్వర్యంలో గురువారం కళాసుబ్బారావు కళావేదిక ప్రాంగణంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ సభలో డా.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆయన ప్రముఖ రచయిత్రి, కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ రచించిన ఆధ్యాత్మికత వృద్ధులకేనా? పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. డా.రమణ మాట్లాడుతూ సత్రమ ఆలోచనలకు, సత్ప్రవర్తనకు ప్రోదిచేసే ఆధ్యాత్మిక, ధార్మిక తత్వబంధిత అంశాలపై రాజ్యశ్రీ రచించిన 19 విలువైన వ్యాసాలు ఈ సంపుటిలో ఉన్నాయని ఆయన వివరించారు. సంస్కారవంతంగా జీవించడానికి అవలంబించాల్సిన విధివిధానాలను ఈ వ్యాసాలు అందిస్తాయన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగల విషయాలు వాటిలో ఉన్నాయన్నారు. ప్రముఖ రచయిత సుధామ అధ్యక్షోపన్యాసం చేస్తూ స్థిత ప్రజ్ఞతను అలవరచుకోవడమే నిజమైన ఆధ్యాత్మికత అన్నారు. ప్రముఖ రచయిత డా.పోతుకూచి సాంబశివరావు మాట్లాడుతూ, ఈ పుస్తకం విద్యార్థులకు, యువతకు చాలా ఉపయోగకరమైనదన్నారు. ప్రముఖ రచయిత్రి డా. లక్ష్మీ పుస్తకసమీక్ష చేశారు. బైసాదేవదాసు, రచయిత డా.వీఎస్ మూర్తి, కళాదీక్షితులు హాజరయ్యారు. డా తెన్నేటి సుధాదేవి సమావేశకర్తగా వ్యవహరించారు. నిర్వాహక సంస్థల ముఖ్యులు వంశీరామరాజు, దర్భారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రాజ్యశ్రీ, వెంకట్రామయ్య పొత్తూరి సుబ్బారావు, జి.వెంకటరెడ్డి, తంగిరాల చక్రవర్తి తదితరులను సత్కరించారు. ముందు నిర్వహించిన భక్తి కవిసమ్మేళనంలో మౌనశ్రీమల్లిక్, శిల్ప మాధవి, ప్రకాష్, వెంకటదాస్, రఘువీర ప్రతాప్, శోభా పేరిందేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో గ్రంథకర్త రాజ్యశ్రీని సత్కరించారు.

శనివారం, 10 ఆగస్టు 2013 ఆంధ్రజ్యోతి

# కేతవరపు రాజ్యశ్రీకి ఆత్మీయ సత్కారం

చిక్కడపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కమలాకర్ లలిత కళాభారతి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మమత సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ ఆత్మీయ సత్కార కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. అశోక్ నగర్‌లోని అశోక్‌నగర్ వెల్ఫేర్ కేంద్రం లోని గ్రంథాలయ భవన సముదాయంలో



ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని సత్కరిస్తున్న తిరునగరి, వంశీ రామరాజు, జి.వెంకటరెడ్డి తదితరులు

జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ రచయిత తిరునగరి, వంశీ సంస్థల అధినేత శిరోమణి వంశీ రామరాజు, నేటినిజం పత్రిక ఎడిటర్ బైసా దేవదాస్, జీవీఆర్ ఆరాధన సంస్థ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, సినీ విశారద ఎస్వీ.రామారావు, ప్రముఖ రచయిత కె.బి.లక్ష్మీ, నిర్వాహక సంస్థ ప్రతినిధి కమలాకర్ భారతి తదితరులు పాల్గొన్నారు. అమెరికాలో జరిగిన నానా సభల్లో పాల్గొని హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు రచయిత రాజ్యశ్రీ గురించి ప్రసంగించారు.

నేటినిజం బుధవారం 14-8-2013

# కేతవరపు రాజ్యశ్రీకి ఆత్మీయ సత్కారం



ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని సత్కరిస్తున్న యస్వీ రామారావు, బైస దేవదాస్, వంశీ రామరాజు, కె.వి.లక్ష్మి, తిరునగరి, పొత్తూరిసుబ్బారావు,జి. వెంకటరెడ్డి, భారతి తదితరులు.

కమలాకర్ లలితా కళాభారతి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మహిళ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ ఆత్మీయ సత్కార కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. అశోక్‌నగర్‌లోని అశోకనగర్ వెల్ఫేర్ కేంద్రంలోని గ్రంథాలయ భవన సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమానికి నేటినిజం పత్రిక ఎడిటర్ బైస దేవదాస్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత తిరునగరి, విశిష్ట అతిథులుగా వంశీ సంస్థల అధినేత శిరోమణి వంశీ రామరాజు, జీవీఆర్ ఆరాధన సంస్థ ఛైర్మన్ గుదిబండి వెంకట రెడ్డి, సినీ విశారద ఎస్వీ రామారావు, ప్రముఖ రచయిత్రి కె.వి. లక్ష్మి, నిర్వాహక సంస్థ ప్రతినిధి కమలాకర్ భారతి తదితరులు పాల్గొన్నారు. అమెరికాలో జరిగిన నాటా సభలో పాల్గొని హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు రచయిత్రి రాజ్యశ్రీ రచనల గురించి ప్రసంగించారు.

12 మన భూపాలపల్లి

# వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

- రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ
- కాయంపేటలో స్వామి వివేకానందుడి విగ్రహావిష్కరణ

**కాయంపేట, న్యూస్‌లైన్ :**

భారతదేశ సంస్కృతిని నలుదిశల చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ, ఏపీ సెక్రటేరియట్ భారతభాషా మహిళ డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట న్యాయవాది లిక్కల జలందర్‌రెడ్డి ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని శనివారం హైకోర్టు జడ్జి ఎల్.నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. తొలుత స్థానిక శివమార్కండేయ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు నూనెడి శరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేతవరపు రాజ్యశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానందుడు పదిమందిలో ఒక్కరు కాదని.. అందరి మనుష్యుల్లో ఒక్కొక్కరిగా ఉన్న వ్యక్తి అని ఆయనను కొనియాడారు. వివేకానందుడు పుట్టిన భూమిపై మన జన్మించడం పూర్వజన్మసుకృతమని చెప్పారు. వివేకానందుడు మహాత్మాగాంధీని సైతం తన ప్రబోధనలతో ప్రభావితం చేశారని, ఈ విషయాన్ని గాంధీజీయే స్వయంగా అన్నారని ఆమె చెప్పారు. సమాజాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన వివేకానందుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాయంపేట సర్పంచ్ పలుమారు చంద్రమౌళి, జాగృతి పత్రిక సహసంపాదకుడు బెల్లంకొండ మల్లారెడ్డి, మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నరహరిరెడ్డి రామకృష్ణ, పాడిశెట్టి గణేశ్, ముంజాల నాగరాజు, మెరుగుత్తి కర్ణాకర్, బొద్దు నాగరాజు, బానోతు శ్రీనివాస్, వనం దేవరాజ్, బానోతు విద్యాసాగర్ పాల్గొన్నారు.



వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్జి నర్సింహారెడ్డి, మాట్లాడుతున్న కేతవరపు రాజ్యశ్రీ

11-1-2014

# సాహిత్య రచనలు... సేవా సుగంధాలు

## రచయిత్రిగా రాణిస్తున్న రాజశ్రీ • పర్యావరణ పరిరక్షణకై లఘు చిత్రాల నిర్మాణం



ప్రముఖ కవి సినారె చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజ్యశ్రీ

[illegible]

**సేవకు గుర్తింపు**



[illegible]

ఆదర్శవాణి మాసపత్రిక
జనవరి - 2014

సాంస్క

# రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీకి "భారత భాషాభూషణ్" అవార్డు వచ్చిన సందర్భంగా అభినందన (భవాని) సభ



శ్రీ త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళావేదికలో రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీకి "భారత భాషాభూషణ్" అవార్డు వచ్చిన సందర్భంగా అభినందన సభ జరిగింది. వివిధ సాంస్కృతిక సంస్థలు ఆమెను సన్మానాలతో ముంచెత్తాయి. ఆదర్శవాణి మాసపత్రిక కేతవరపు రాజ్యశ్రీ గారిని ఈ సభలో ఘనంగా సన్మానించింది. ఎడమ నుండి కుడికి తెలుగు సాహిత్య కళాపీఠం అధ్యక్షులు, ఆదర్శవాణి మాసపత్రికా గౌరవ సలహాదారు చిక్కా రామదాసు, ఆదర్శవాణి మాసపత్రిక ప్రధాన సంపాదకులు వంగాల బాలరాజ్‌గౌడ్, సహ సంపాదకులు కైరంకొండ నరసింహులు పద్మశాలి, అభినందన భవానీ, సాహితీ కిరణం సంపాదకులు సుబ్బారావు, డాక్టర్ తిరునగరి, పొత్తూరి సుబ్బారావు, డాక్టర్ పి.ఎస్.మూర్తి, డాక్టర్ డి. మధుసూదన్, తంగిరాల చక్రవర్తి, ఇతర సాహితీ మిత్రులు.

# సహృదయ స్పందనలు

మంచుకొండ రీవి, మరుమల్లియ తావి - ఈ కవితా రాజ్యశ్రీ ప్రతి కవితా ప్రజల హృదయాలలో గుబాళిస్తూనే వుంటుంది. గద్యమైనా, పద్యమైనా హృద్యంగా రాసే శిల్పాన్ని సొంతం చేసుకున్న కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ. ఆధునిక సాహిత్య రంగంలో మంచి కవయిత్రిగా తన స్థానాన్ని పదిలపరచుకున్నారు.

డా॥ తిరునగరి

"అక్షరాలు పరిమితం, అవి వెదజల్లే జ్ఞానపరిమళాలు విశ్వవ్యాప్తం" అన్న రాజ్యశ్రీగారి మాట ఈ కవితల్లో సార్థకమవుతున్నది. ఆమె ఊహల్లో ఉయ్యాలలూగింది, భావాల్లో పసిడి స్నానం చేసింది. అమితమైన కవితాభిరుచి కలిగిన కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీ.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యాక్షులు

తన కవితల ద్వారా ఎగిరే రెక్కల్తో, భావాంభర వీధిలో పాఠకులను విహరింప చేయడమే శ్రీమతి రాజ్యశ్రీ లక్ష్యం.

డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్.

రాజ్యశ్రీ హృదయం స్పందిస్తే వారి కలం స్పృశించని అంశంగాని, ప్రక్రియగానీ వుండదు. వారి సాహితీ ప్రస్థానం నిరంతరం కొనసాగాలని నా ఆకాంక్ష.

రంగనాథ్

ప్రముఖ సినీ నటులు, రచయిత

చేరా, బూరా, నారా అని పురుష సాహితీవేత్తలు తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులై వున్నారు. స్త్రీలలో ఆరుద్రగారి ధర్మపత్ని కె. రామలక్ష్మిగారిని కేరా అన్నారు. ఇప్పట్లో మరి కేరా అంటే కేతవరపు రాజ్యశ్రీగారనే చెప్పాలి. బ్రతుకు తీపిపెంచే మానవీయ కవిత్వం ఆమెది. కావ్యకర్తగా మరెన్నో ప్రతిభా రాజ్యశ్రీలను దక్కించుకుని రచనా కేతనాలను ఆమె ఎగుర వేయాలని నా ఆకాంక్ష.

సుధామ

కవి, విమర్శకులు

డా॥ కేతవరపు రాజ్యశ్రీగారు సాహిత్యంలో అన్ని ప్రక్రియలలోనూ చాలా వున్నత స్థితిని చేరుకున్నారు. గుండె చప్పుళ్ళు వింటూ 'తృప్తీ నీవెక్కడ', అని అన్వేషిస్తూ, 'వెన్నెల మెట్లు" ఎక్కుతూ రోజు రోజుకూ హిమాలయ శిఖరాలందుకోవడంలో కృతకృత్యులవుతున్నారు.

డా॥ డి. మధుసూధన్

ఐఎన్‌టి స్పెషలిస్టు